# జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక :317 ఆదివారం 19-7-2026 పేజీలు:8 వెల:3 https://www.epaperjournalistdiary.com/







## కువైట్ చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి



- ఏడో రోజూ కొనసాగిన అమెరికా వైమానిక దాడులు
- గల్ఫ్‌లో ఉద్రిక్తత.. బహ్రెయిన్, జోర్డాన్‌పైనా దాడులు
- పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ హెచ్చరిక
- హెర్మూజ్ జలసంధిలో రెండు చమురు నౌకలు పేలినట్లు ప్రచారం

2 లో

## కరెన్సీ నోట్ల ముద్రణలో ప్రైవేటు భాగస్వామ్యమా?



- ఆర్‌బీఐ అనుబంధ సంస్థ టెండర్‌పై అఖిలేశ్ అభ్యంతరం
- పాలిమర్ సబ్‌స్ట్రేట్ షీట్ల సరఫరాకు బిడ్డింగ్‌ల ఆహ్వానం
- నోట్ల ముద్రణ భద్రత, భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన ఎస్పీ అధినేత
- 'కరెన్సీ నోట్లనూ ప్రైవేటీకరిస్తారా?' అంటూ కేంద్రంపై విమర్శలు

2 లో

# అందెశ్రీ నాకు ఆత్మబంధువు

**ఆయన స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష' : సీఎం రేవంత్ రెడ్డి**

- ఆయన గళంలోని స్ఫూర్తే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది
- ఘట్‌కేసర్‌లో అందెశ్రీ స్మృతివనానికి శంకుస్థాపన
- తెలంగాణపై పెత్తనం చెలాయిస్తే మరో అందెశ్రీ పుడతాడు
- అందెశ్రీ, గద్దర్ ఆశయాలతోనే ప్రజా ప్రభుత్వం ముందుకు
- ఉద్యమ యోధుల కుటుంబాలకు రూ.కోటి చొప్పున సాయం గుర్తు చేసిన సీఎం
- 'జయ జయహే తెలంగాణ'తో ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తి రగిలించిన మహాకవి
- అందెశ్రీ కుటుంబ సభ్యుల సమక్షంలో భూమిపూజ.

హైదరాబాద్/ఘట్‌కేసర్:

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న స్మృతి వనానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, అందెశ్రీ తనకు కేవలం కవి, గాయకుడు, ఉద్యమకారుడు మాత్రమే కాదని, ఆత్మబంధువని భావోద్వేగంగా పేర్కొన్నారు. "నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అందెశ్రీ కవిగా, గాయకుడిగా, ఉద్యమకారుడిగా పరిచయం ఉండొచ్చు. కానీ నాకు మాత్రం ఆయన ఒక ఆత్మబంధువు. ఆయన గానంలో ఉన్న గొప్పతనం, గళంలో ఉన్న స్ఫూర్తే నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చింది. ఈరోజు నేను రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నానంటే, అందెశ్రీ నాలో రగిల్చిన స్ఫూర్తి కూడా ఒక కారణం"

-మిగతా 2 లో







## విక్రమ్-1 విజయవంతం

- భారత ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాల్లో చారిత్రక ఘట్టం
- శ్రీహరికోట నుంచి తొలి ఆర్బిటాల్ రాకెట్ ప్రయోగం సక్సెస్
- సాంకేతిక లోపాన్ని అధిగమించి కక్ష్యలోకి చేరిన విక్రమ్-1
- 'మిషన్ ఆగమన్'తో వాణిజ్య అంతరిక్ష ప్రయోగాలకు కొత్త దారి
- స్వదేశీ సాంకేతికతతో 350 కిలోల ఉపగ్రహాల పంపిణీ సామర్థ్యం

శ్రీహరికోట

భారత అంతరిక్ష రంగంలో మరో అధ్యాయం ప్రారంభమైంది. ప్రముఖ స్పేస్‌టెక్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్ ' పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి ఆర్బిటాల్ క్లాస్ రాకెట్ 'విక్రమ్-1 ' శనివారం నింగిలోకి దూసుకెళ్లింది. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి మధ్యాహ్నం 12.05 గంటలకు చేపట్టిన ఈ ప్రయోగం విజయవంతమైంది. ఇందులోని ఉపగ్రహాలను నిర్ణీత కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. వాస్తవానికి ఉదయం 11.30 గంటలకు ప్రయోగం జరగాల్సి ఉండగా.. సాంకేతిక లోపం తలెత్తింది. దీంతో ప్రయోగాన్ని తాత్కాలికంగా నిలిపివేసి.. శాస్త్రవేత్తలు పరిశీలనలు చేపట్టారు. ఇంధన ప్రక్రియలో సమస్య ఉన్నట్టు గుర్తించి దాన్ని సరిచేశారు. 35 నిమిషాల తర్వాత రాకెట్‌ను ప్రయోగించారు. దాదాపు 20 నిమిషాల తర్వాత ఈ రాకెట్ నిర్ణీత కక్ష్యను చేరుకుంది. 'హలో స్పేస్.. విక్రమ్-1 వచ్చేసింది' అంటూ ప్రయోగం విజయంపై స్కైరూట్ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది. ఈ రాకెట్.. సాంకేతిక పేలోడ్లతో పాటు ప్రధాని మోడీ తన చేతిరాతతో 'వందేమాతరం' అని రాసి పంపిన ప్రత్యేక పోస్ట్‌కార్డును అంతరిక్షంలోకి తీసుకెళ్లింది.

-మిగతా 2లో



## మీ హయాంలో ఎన్నిఉద్యోగాలిచ్చారు ?

- బీజేపీ ఇస్తానన్న ఏడాదికి రెండు కోట్ల జాబులేవీ ?
- నోటిఫికేషన్లు కాదు... ఉద్యోగాలు ఎందుకు ఆపారు?
- పేపర్ లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారు? : టీపీసీసీ చీఫ్

హైదరాబాద్

గత బీఆర్ఎస్ సర్కార్ తన పదేండ్ల పాలనలో ఎన్ని ఉద్యోగాలిచ్చింది. నోటిఫికేషన్లు జారీ చేశామంటే సరిపోదు... ఉద్యోగాలు ఎందుకు ఆపారో చెప్పాలని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. శనివారం హైదరాబాద్ లోని గాంధీభవన్ లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని హామీ ఇచ్చిందనీ, ఆ ఉద్యోగాలేవో చెప్పాలన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో, ఇప్పుడు కేంద్రంలో బీజేపీ సర్కారులో పేపర్ లీకేజీలకు ఎవరు బాధ్యత వహిస్తారని బీఆర్ఎస్, బీజేపీలపై విరుచుకుపడ్డారు. గత రెండున్నరేండ్లలో రాష్ట్రంలో

-మిగతా 2 లో



## నగరంలో మోస్తరు వర్షం

- గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన
- బీహెచ్‌ఈఎల్‌లో అత్యధికంగా 1.40 సెం.మీ వర్షపాతం నమోదు
- పటాన్‌చెరు, లింగంపల్లి ప్రాంతాల్లోనూ వర్ష ప్రభావం
- మరో 36 గంటల్లో వానలు పడే అవకాశం
- నగరంలో 31.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

2లో

## ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు

**రాజౌరి సెక్టార్‌లో రెండు గంటలపాటు కాల్పుల మోత**

- ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టిన భారత సైన్యం
- పాక్ కాల్పులకు భారత బలగాల నుంచి దీటైన ప్రతిస్పందన
- సరిహద్దులో గాలింపు.. అనుమానితులు జాడలేదు
- 'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి కాల్పుల ఘటన

జమ్ము కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ మరోసారి కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించింది. శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు పాక్ సైన్యం కాల్పులు జరపగా, అప్రమత్తమైన భారత సైనికులు దీటుగా ఎదురుకాల్పులు జరిపి ఉగ్రవాదుల చొరబాటు ప్రయత్నాన్ని భగ్నం చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత ఎల్‌వోసీ వద్ద పాక్ నుంచి కాల్పులు జరగడం ఇదే తొలిసారి అని సైనిక వర్గాలు వెల్లడించాయి.

2లో





## పెట్టుబడి సూచీలో గుజరాత్ టాప్

- నీతి ఆయోగ్ తొలి ఐఎఫ్ఐలో గుజరాత్‌కు అగ్రస్థానం
- మహారాష్ట్ర, తమిళనాడులకు తర్వాతి ర్యాంకులు
- 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలపై అధ్యయనం
- పెట్టుబడుల ఆకర్షణ సామర్థ్యంపై రూపొందిన సూచీ
- 1,850 మంది పెట్టుబడిదారుల అభిప్రాయాలతో నివేదిక

న్యూఢిల్లీ

నీతి ఆయోగ్ రూపొందించిన మొట్టమొదటి పెట్టుబడి స్నేహపూర్వక సూచీ(ఐఎఫ్ఐ)- 2026లో దేశంలోనే అత్యంత పెట్టుబడి-అనుకూల రాష్ట్రంగా గుజరాత్ నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో మహారాష్ట్ర, తమిళనాడు ఉన్నాయి. ఒకరి ఉత్తమ విధానాల నుండి మరొకరు నేర్చుకుంటూనే ప్రైవేట్ పెట్టుబడుల కోసం పోటీపడేలా ఈ సూచీ ర్యాంకింగ్‌లు రాష్ట్రాలను ప్రోత్సహిస్తాయని నీతి ఆయోగ్ ఆశిస్తున్నది. శుక్రవారం విడుదలైన ఐఎఫ్ఐ నివేదిక పెట్టుబడులను ఆకర్షించి, వాటిని నిలబెట్టుకునే సామర్థ్యంపై 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలను అంచనా వేస్తుంది. ఇందుకు సంబంధించిన ఫ్రేమ్‌వర్క్‌ను సిద్ధం చేసేటపుడు 1,850 మందికి పైగా పెట్టుబడిదారులను సర్వే చేయడంతోపాటు 165 మంది వాటాదారుల నుండి వచ్చిన సూచనలను కూడా పొందుపరిచారు. ఈ నివేదిక రాష్ట్రాలను అగ్రశ్రేణి రాష్ట్రాలు, ముందంజలో ఉన్న రాష్ట్రాలు, వర్ధమాన రాష్ట్రాలు, ఆకాంక్ష గల రాష్ట్రాలుగా వర్గీకరించింది.

# నిరుద్యోగులకు నేను తోడుంటా



**అధికార పార్టీకి ఇక డెత్ డిక్లరేషనే**

- నోటిఫికేషన్లు లేవు.. అన్నీ లూటిఫికేషన్లే
- మా పాలనలో కొన్ని పొరపాట్లు జరిగాయి
- ఇప్పటిదాకా ఒక లెక్క... ఇకపై మరో లెక్క
- 70 వేల ఉద్యోగాలు ఇచ్చినట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా : సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్
- యువ సంగ్రామ సదస్సుకు భారీగా తరలొచ్చిన నిరుద్యోగులు

హైదరాబాద్

యూత్ డిక్లరేషన్ పేరుతో యువతను కాంగ్రెస్ పార్టీ దారుణంగా మోసం చేసిందనీ, నయవంచనకు గురిచేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శిం చారు. ఉద్యోగాలను భర్తీ చేయని కాంగ్రెస్ పార్టీకి యువత ఇక డెత్ డిక్లరేషనే రాస్తుందని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ 'యువ సంగ్రామ సదస్సు' నిర్వహించింది. యువతీ,

-మిగతా 2 లో



## కల్తీల నిరోధానికి కఠిన చట్టం

- సమాచార సేకరణకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలి
- చట్టం తయారీకి శాసనసభలో సమగ్ర చర్చ
- క్యూర్ పరిధిలో పైలెట్‌గా తొలుత అమలు
- ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

హైదరాబాద్

ఆహార, ఔషధాల కల్తీల నిరోధానికి కఠిన చట్టం రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. కూరగాయలు, పండ్లు, పాలు అన్ని కల్తీల బారిన పడుతుండడంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యాల బారిన పడుతున్నారని సీఎం అన్నారు. తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (టీజీఎఫ్ఏడీసీఏ)పై ఎంసీహెచ్ఆర్డీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం సమీక్ష నిర్వహించారు. ఆకుకూరలు, కూరగాయలు, పాలు ఎక్కువ రోజులు నిల్వ ఉంచేందుకు, పండ్లు త్వరగా మగ్గేందుకు విచ్చలవిడిగా రసాయనాలు వాడుతుండడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. ఎరువులు, పురుగు మందుల భారీ వాడకంతో

-మిగతా 2 లో

# ఎల్‌వోసీ వెంబడి పాక్ కాల్పులు

-ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని తిప్పికొట్టిన భారత సైన్యం
-పాక్ కాల్పులకు భారత బలగాల నుంచి దీటైన ప్రతిస్పందన
-సరిహద్దులో గాలింపు.. అనుమానితులు జాడలేదు
-'ఆపరేషన్ సిందూర్' తర్వాత తొలి కాల్పుల ఘటన



**న్యూఢిల్లీ:**
పాకిస్థాన్ మరోసారి దుశ్చర్యకు పాల్పడింది. జమ్ము కశ్మీర్‌లోని రాజౌరి సెక్టార్‌లో నియంత్రణ రేఖ (ఎల్‌వోసీ) వెంబడి శుక్రవారం రాత్రి రెండు గంటల పాటు పాకిస్థాన్ భారీ కాల్పులు జరిపింది. సరిహద్దు నుంచి ఉగ్రవాదులు చొరబడేందుకు ప్రయత్నించగా.. భారత సైనికులు ఎదురు కాల్పులు జరిపి.. ఉగ్రవాదులు చొరబడకుండా అడ్డుకున్నారని సైనిక వర్గాలు తెలిపాయి. ముందుగా పాక్ నుంచి కాల్పులు ప్రారంభం అయిన వెంటనే సరిహద్దు వెంట కాపలా కాస్తున్న సైనికులు ఎదురు కాల్పులు జరిపారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. శనివారం ఉదయం సరిహద్దు వెంట గాలింపు చర్యలు చేపట్టగా ఎవరూ లేరని అధికారులు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాక్ కాల్పులు జరపడం ఇదే మొదటిసారి అని చెప్తుతున్నారు.

# విక్రమ్–1విజయవంతం

మొదటి తరువాయి

వీటితో పాటు కాస్మోస్ డైమండ్స్ సంస్థ రూపొందించిన 'కాస్మిక్ బ్లూమ్' ఆర్ట్‌వర్క్, విక్రమ్–1 రాకెట్ సూక్ష్మ ప్రతిరూపాన్ని కూడా నింగిలోకి పంపారు. దీనిపై సర్ సీవీ రామన్, విక్రమ్ సారాభాయ్, ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మరూపాలను చెక్కారు. అంతేగాక, ప్రయోగం విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ స్కైరూట్ బృంద సభ్యులు, ఇస్రో మాజీ చైర్మె న్లు, శాస్త్రవేత్తలు, భారతీయ వ్యోమగాములు, ఇతరులు పంపిన డజన్ల కొద్దీ చేతిరాత పోస్ట్‌కార్డులను సైతం ప్రత్యేక పేలోడ్ బాక్స్‌లో భద్రపరిచారు.

'మిషన్ ఆగమన్'..


'మిషన్ ఆగమన్' పేరుతో స్కైరూట్ ఈ ప్రయోగం చేపట్టింది. భారత ప్రయివేట్ అంతరిక్ష రంగం ఆర్బిటాల్ ప్రయోగాల యుగంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఈ మిషన్‌కు ఆ పేరు పెట్టారు. విక్రమ్–1 ద్వారా గ్రహాస్పేస్, కాస్మోసెర్వ్, డీక్యూబ్డ్ సంస్థలకు చెందిన టెక్నాలజీ డెమాన్‌స్ట్రేషన్ పేలోడ్లతో పాటు స్కైరూట్‌కు చెందిన 'స్కోప్'ను రోదసిలోకి పంపించారు. ప్రయోగం ద్వారా రాకెట్‌లోని ప్రొపల్షన్, స్టేజ్ సెపరేషన్, గైడెన్స్, నావిగేషన్, కంట్రోల్ వ్యవస్థల పనితీరును అంతరిక్ష ప్రయాణంలో పరీక్షించి కీలక సమాచారం సేకరించనున్నారు. ఈ సమాచారంతో భవిష్యత్తు వాణిజ్య ప్రయోగాల అవసరాలకు సాంకేతిక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. సుమారు ఏడు అంతస్తుల భవనం ఎత్తుతో రూపొందిన విక్రమ్–1 పూర్తిగా కార్బన్ కాంపోజిట్ నిర్మాణం తో తయారైంది. దేశీయంగా అభివృద్ధి చేసిన 3డీ ప్రింటెడ్ ఇంజిన్లు, ఘన ఇంధన బూస్టర్లతో పనిచేసే ఈ రాకెట్ 350 కిలోల వరకు చిన్న ఉపగ్రహాలను 450 కిలోమీటర్ల ఎత్తులోని లో ఎర్త్ ఆర్బిట్(ఎల్ఈఓ)లో ప్రవేశపెట్టే సామర్థ్యం కలిగి ఉంది. 2022లో విక్రమ్–ఎస్ ద్వారా భారత తొలి ప్రయివేట్ రాకెట్‌ను విజయవంతంగా అంతరిక్షంలోకి పంపిన స్కైరూట్.. ఇప్పుడు విక్రమ్–1తో దేశపు తొలి ప్రయివేట్ ఆర్బిటాల్ ప్రయోగం చేపట్టడం విశేషం.

# మీ హయాంలో ఎన్నిఉద్యోగాలిచ్చారు ?

మొదటి తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఉద్యోగాలు రికార్డుల్లో ఉన్నాయని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాకి లెక్కలు చెప్పడం లేదనీ, అన్ని కరెక్ట్ లెక్కలే చెబుతున్నామన్నారు. ఈ కార్ రేసింగ్ లో మంత్రులు స్కాం లు చేయలేదా? కాళేశ్వరం కూలిపోలేదా? బీఆర్ఎస్ లెక్కలు జనాలు తీర్చారు. ఇంకా ఏమి కావాలి? అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఒక్క గ్రూప్ వన్ ఉద్యోగం కూడా బీఆర్ఎస్ భర్తీ చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంటికో ఉద్యోగమిస్తామని కేసీఆర్ తన కుటుంబ సభ్యులందరికి ఉద్యోగాలిచ్చుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ఎద్దేవా చేశారు. నీళ్లు, నిధులను దోపిడీ చేశారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 70 వేల మందికిపైగా ఉద్యోగ పత్రాలను బహిరంగంగా అందజేసిందని గుర్తుచేశారు. బీఆర్ఎస్ దుష్టపాలనను ప్రజలు మరిచిపోలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పథకాలు అద్భుతంగా అమలు అవుతున్నాయని కొనియాడారు. రూ.8 లక్షల కోట్ల అప్పులను భరిస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని వివరించారు. పదేండ్లలో ఇచ్చిన ఉద్యోగాల లెక్క చెప్పని బీఆర్ఎస్ నేతలకు విద్యార్థులు, నిరుద్యోగుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదన్నారు. హామీ ఇచ్చినట్టుగానే ప్రతి నెల పది లోపు ఉద్యోగులకు జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. నోటిఫికేషన్ ఇచ్చేందుకే బీఆర్ఎస్ భయపడితే, తాము నియామక పత్రాలను అందజేశామని వివరించారు. రాహుల్ గాంధీ హామీ మేరకు ఆరు గ్యారంటీలను అమలు చేస్తున్నామన్నారు.

# కరెన్సీ నోట్ల ముద్రణనూ ప్రైవేటీకరిస్తారా?..



**లక్నో,జూలై 18:**
భారత కరెన్సీ నోట్ల ముద్రణ ప్రక్రియలో ఒక ముఖ్యమైన భాగాన్ని ప్రైవేటీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సమాజ్‌వాది పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ శుక్రవారం ఆరోపించారు. రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) అనుబంధ నోట్ల ముద్ర సంస్థ జారీచేసిన టెండర్ నోటీసుపై ఎక్స్‌లో ట్వీట్ చేశారు. రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్(బీఆర్‌బీఎన్ఎంపీఎల్) జారీచేసిందని. ఈ నోటీసు భారతీయ కరెన్సీ నోట్ల కోసం భద్రతా లక్షణాలతో కూడిన ప్రత్యేక పాలిమర్ సబ్‌స్టే షీట్ల తయారీ, సరఫరా కోసం అర్హత గల సంస్థల నుండి ప్రపంచవ్యాప్తంగా బిడ్డింగ్‌లను ఆహ్వానిస్తోందని తెలిపారు. కరెన్సీ నోట్ల ముద్రణ భవిష్యత్తుపై ఈ చర్య ఆందోళనలు రేకెత్తించిందని పేర్కొన్నారు. అవినీతిమయమైన బీజేపీ పాలనలో ఇక కరెన్సీ నోట్లను కూడా ప్రైవేటీకరిస్తారా? కమీషన్లు తీసుకునే విధానం ఇంతటి అథమ స్థాయికి దిగజారుతుందని ప్రజలు ఊహించలేదు" అని అఖిలేశ్ విమర్శించారు.

# అందెశ్రీ నాకు ఆత్మబంధువు

మొదటి తరువాయి

అని సీఎం అన్నారు. తన కుటుంబంలో ఏడుగురు అన్నదమ్ములలో తాను నాలుగో వాడినని, తన పెద్దన్న మరణించిన తర్వాత ఆ స్థానాన్ని తన జీవితంలో అందెశ్రీ భర్తీ చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఉద్యమంలో ఆయనతో ఏర్పడిన సాన్నిహిత్యాన్ని స్మరించుకుంటూ, తెలంగాణపై ఆధిపత్యం చెలాయించేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే మరో అందెశ్రీ మళ్లీ పుడతారని హెచ్చరించారు. "అందెశ్రీ స్ఫూర్తి మన గుండెల్లో నిత్యం కొలువై ఉంటుంది. ఆయన స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష. అందెశ్రీ, గద్దర్ ఆశయాలకు అనుగుణంగానే మా ప్రభుత్వం పనిచేస్తుంది" అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో తమ జీవితాలను అంకితం చేసిన తొమ్మిది మంది ఉద్యమకారులను పార్టీ, జెండాలకు అతీతంగా గుర్తించి, వారి కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1 కోటి ఆర్థిక సహాయం అందించామని తెలిపారు. అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ', 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' వంటి పాటలు కేవలం గీతాలు మాత్రమే కాదని, ప్రజా వ్యతిరేక పాలనలను కూల్చిన ఉద్యమ ఆయుధాలని సీఎం పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించి, ప్రతి యువకుడిని ఉద్యమం వైపు నడిపించిన మహోన్నత ఉద్యమకారుడిగా అందెశ్రీని కొనియాడారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన అనంతరం 2024 జూన్ 2న 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా అధికారికంగా ప్రకటించిన సందర్భంగా అందెశ్రీ భావోద్వేగానికి గురైన సందర్భాన్ని కూడా ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో స్మృతి వన నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.

# నిరుద్యోగులకు నేను తోడుంటా

మొదటి తరువాయి

యువకులు వేలాదిగా తరలొచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేటీఆర్ మాట్లాడుతూ మాయమాటలతో యువతను మోసం చేసి అధికారంలోకి వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ఇచ్చిన యూత్ డిక్లరేషన్ పెద్ద మోసమనీ, ప్రియాంక గాంధీ చేతుల మీదుగా ఓ బురిడీ పత్రాన్ని విడుదల చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు చేసిన మోసాన్ని యువత మార్చిపోదనీ, గుర్తుపెట్టుకుని కచ్చితంగా గుణపాఠం చెప్తుందని అన్నారు. మూడేండ్ల క్రితం అశోక్ నగర్ చౌరస్తాలో చాయ్ తాగుతూ నిరుద్యోగులతో దిగిన ఫొటోలు, ఇచ్చిన జూటా హామీలు గుర్తున్నాయా? అని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. ఇచ్చిన హామీల అమలు, ఉద్యోగాల భర్తీ గురించి ప్రభుత్వాన్ని నిలదీస్తే ఎక్కడికక్కడ అక్రమ అరెస్టులతో వేధింపులతో అవహేళనతో కాంగ్రెస్ ప్రభుత్వం అణిచివేస్తున్నదని అన్నారు. 'యూత్ డిక్లరేషన్' హామీల పరిస్థితి ఏమైందని రాహుల్ గాంధీని కేటీఆర్ ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఇస్తామన్న రెండు లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఏమయ్యాయో చెప్పాలని డిమాండ్ చేశారు. జాబ్ క్యాలెండర్‌తోపాటు నెలకు రూ.నాలుగు వేల నిరుద్యోగ భృతి ఏదని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉద్యోగాల నోటిఫికేషన్లను ఇవ్వడం పక్కనబెట్టి, 'లూటీఫికేషన్' (దోపిడీ) లో మునిగిపోయిందని ఆరోపించారు. జాబులు ఇవ్వడం లేదు కానీ రాహుల్‌గాంధీ జేబులు నింపుతున్నారని అన్నారు. అశోక్ నగర్, దిల్‌షుక్‌నగర్ వేదికగా కొలువులు అడుగుతున్న నిరుద్యోగులపై రేవంత్ రెడ్డి సర్కార్ లాఠీఛార్జీలు, అర్ధరాత్రి అరెస్టులతో దమనకాండ సాగిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగాలు అడిగితే "ఎండ్రిన్ తాగి చావండి, బావిలో దూకండి" అంటున్న సీఎం రేవంత్‌రెడ్డి అహంకారానికి, కాంగ్రెస్ సర్కారుకు రాబోయే రోజుల్లో యువత ఘోరి కట్టడం ఖాయమని కేటీఆర్ హెచ్చరించారు. హిట్లర్ కంటే దారుణమైన ముగింపును చూస్తారని అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన ఉద్యోగాలను కాంగ్రెస్ ఖాతాలో వేసుకుంటున్నారని విమర్శించారు. కొత్త నోటిఫికేషన్లు ఇచ్చి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్టు నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయ సన్యాసం తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డికి కేటీఆర్ సవాల్ విసిరారు.

ఇప్పటిదాకా ఒక లెక్క.. ఇకపై మరొ లెక్క

కాంగ్రెస్ చేస్తున్న మోసాలను చూస్తూ కూడా తెలంగాణ మేధావులు మౌనంగా ఉండడం ఆవేదన కలిగిస్తోందని కేటీఆర్ అన్నారు. "జీనా హై తో మర్నా సీఖో.. కదమ్ కదమ్ పర్ లడ్నా సీఖో" అంటూ కొట్లాడిన యువతరం ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తే పాలకుల కుర్చీలు కూలిపోవడం, పీఠాలు కదిలిపోవడం ఖాయమని హెచ్చరించారు. ఇప్పటిదాకా ఒక లెక్క ఇకపై మరో లెక్క అని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగానే కాంగ్రెస్ ప్రభుత్వ మోసాలను నిరంతరం ఎండగడ తామని చెప్పారు."యువతకు ఏ కష్టం వచ్చినా ఒక అన్నగా, సోదరుడిగా నేను ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను. 2028లో ఖచ్చితంగా మళ్లీ కేసీఆరే ముఖ్యమంత్రి అవుతారు. రాబోయే బీఆర్ఎస్ ప్రభుత్వంలో యువత ఆకాంక్షలకు న్యాయం చేసే బాధ్యత నాది" అని కేటీఆర్ అన్నారు. ఉద్యోగాలు భర్తీ చేయకుండా ఉన్మాదం, అహంకారం తలకెక్కించుకున్న రేవంత్‌రెడ్డికి తగిన సమయంలో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

1.62 లక్షల ఉద్యోగాలు భర్తీ చేశాం

బీఆర్ఎస్ హయాంలో 2,32,000 ఉద్యోగాల భర్తీ ప్రక్రియను ప్రారంభించామని కేటీఆర్ అన్నారు. దాదాపు 27 లక్షల ప్రభుత్వ, ప్రయివేట్ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించామన్నారు. అయితే టీజీపీఎస్సీ పేపర్ లీక్ వ్యవహారంలో మరింత వేగంగా స్పందించాల్సి ఉండేదని చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో కొన్ని పొరపాట్లు జరిగాయని అంగీక రించారు. గతంలో ఏవైనా తప్పులు జరిగి ఉంటే వాటిని సవరించుకుంటామనీ, ఖచ్చిత ంగా వచ్చే ఎన్నికల తర్వాత ఏర్పడే ప్రభుత్వంలో యువత ఆలోచనలకు, అవకా శాలకు మరింత ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో 1,62,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని గుర్తు చేశారు.

# నగరంలో మోస్తరు వర్షం

- గ్రేటర్‌లో పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వాన
-బీహెచ్‌ఈఎల్‌లో అత్యధికంగా 1.40 సెం.మీ వర్షపాతం నమోదు
- పటాన్‌చెరు, లింగంపల్లి ప్రాంతాల్లోనూ వర్ష ప్రభావం
- మరో 36 గంటల్లో వానలు పడే అవకాశం
-నగరంలో 31.5 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదు



జూలై 18
గ్రేటర్‌లోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసింది. రాత్రి 10గంటల వరకు బీహెచ్‌ఈఎల్‌లో 1.40సెం.మీలు, పటాన్‌చెరులో 1.18సెం.మీలు, లింగంపల్లిలో 1.19సెం.మీలు, అమీన్‌పూర్‌లో 1.08సెం.మీలు, మియాపూర్‌లో 1.0 సెం.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు టీజీడీపీఎస్ అధికారులు వెల్లడించారు. రాగల 36గంటల్లో నగరంలోని పలు చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వాన కురిసే అవకాశాలున్నట్లు అధికారులు తెలిపారు. కాగా శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 31.5 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 23.5 డిగ్రీలు, గాలిలో తేమ 89శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు.ం

# కువైట్ చమురు కేంద్రంపై ఇరాన్ క్షిపణి దాడి

-ఏడో రోజూ కొనసాగిన అమెరికా వైమానిక దాడులు
-గల్ఫ్‌లో ఉద్రిక్తత.. బహ్రెయిన్, జోర్డాన్‌పైనా దాడులు
-పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధమంటూ ఇరాన్ హెచ్చరిక
-హెర్ముజ్ జలసంధిలో రెండు చమురు నౌకలు పేలినట్లు ప్రచారం



**టెహ్రాన్, జూలై 18:**
పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు దీని ప్రభావం గల్ఫ్‌పై కూడా తీవ్రంగా పడుతున్నది. ఇరాన్ మిలిటరీ సౌకర్యాలు లక్ష్యంగా అమెరికా ఏడవ రోజు దాడులు కొనసాగించింది. దీనికి ప్రతీకారంగా యూఎస్ స్థావరాలు లక్ష్యంగా ఇరాన్ శనివారం కువైట్, బహ్రెయిన్, జోర్డాన్‌లపై క్షిపణి, డ్రోన్ల దాడులు నిర్వహించింది. కువైట్‌లోని ఒక ప్రధాన చమురు కేంద్రంపై దాడులు చేసింది. తమకు చెందిన ఒక ముఖ్యమైన ఆయిల్ కేంద్రంపై ఇరాన్ దాడి చేసినట్టు కువైట్ పెట్రోలియం కార్పొరేషన్ ప్రకటించింది. ఈ దాడిలో పలువురు గాయపడగా, గణనీయమైన నష్టం ఏర్పడింది. ఈ దాడులు నీటిశుద్ధి ప్లాంట్లు, విమానాశ్రయ కార్యకలాపాలకు అంతరాయం కలిగించాయి. తమపై దాడులు ఇలా మరో మూడు నాలుగు రోజులు కొనసాగితే తాము పూర్తి స్థాయి ఘర్షణకు దిగుతామని ఇరాన్ హెచ్చరించింది. తమ విద్యుత్తు మౌలిక సదుపాయాలపై దాడులు చేస్తే పరిస్థితి తీవ్రంగా ఉంటుందని, ఎర్ర సముద్రంలోని బాబ్ అల్ మాండెబ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.

మందుపాతరలు పేలి రెండు చమురు నౌకలు ధ్వంసం!

ఆంక్షలను ఉల్లంఘించి హెర్ముజ్ జలసంధిని దాటడానికి ప్రయత్నించిన రెండు చమురు నౌకలు సముద్రంలో అమర్చిన మందుపాతరలకు తగిలి నిప్పంటుకుని పేలిపోయాయి. ఇరాన్ పాక్షిక అధికారిక వార్తా సంస్థ తస్నీమ్ న్యూస్ శుక్రవారం ఈ విషయాన్ని వెల్లడించింది. అమెరికా సహకారంతో హెర్ముజ్ జలసంధిని దాటడానికి ప్రయత్నించిన నాలుగు నౌకలను అడ్డుకున్నామని, రెండు చమురు నౌకలు పేలిపోయాయంటూ ఇరాన్ చేసిన ప్రకటనను యూఎస్ మిలిటరీ సెంట్రల్ కమాండ్ ఖండించింది. ఇందులో నిజం లేదని స్పష్టం చేసింది.

# కల్తీల నిరోధానికి కఠిన చట్టం

మొదటి తరువాయి



పంట ఉత్పత్తుల్లోనూ రసాయన అవశేషాలు బయటపడి దిగుమతి చేసుకోవడానికి విదేశాలు నిరాకరిస్తున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. మార్కెట్ లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో పలురకాల ఉత్పత్తులు అమ్ముతున్నారని, అధిక ధరలకు ప్రజలు వాటిని కొంటున్నా... అవి సేంద్రియ ఉత్పత్తులే అని నిర్ధరించేందుకు సరైన వ్యవస్థలు లేవన్నారు. ఈ నేపథ్యంలో కల్తీల నిరోధానికి సమగ్ర చట్టాలు ఉన్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు. ఆయా అధ్యయనాల ఆధారంగా ఒక సమగ్రమైన నివేదికను తయారు చేయాలన్నారు. దానిపై బిల్లు రూపొందించి శాసనసభలో సమగ్రమైన చర్చ చేపడతామని తెలిపారు. శాసనసభలో చర్చతో పాటు ప్రజల నుంచి అభిప్రాయాలు స్వీకరించాలని సూచించారు. కల్తీలకు సంబంధించి సమగ్ర సమాచార సేకరణకు విజిల్ బ్లోయర్లను నియమించాలని, టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలన్నారు. కల్తీల నిరోధానికి సంబంధించి ముందుగా క్యూర్ ప్రాంతాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇక్కడ నిబంధనలు అమలు చేసి వాటి అమలులో వచ్చే లోటుపాట్ల ఆధారంగా ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సి.వి.ఆనంద్, సీఎం సలహాదారు, ఎక్స్ ఆఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ కె.రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు వి.శేషాద్రి, ఎన్.శ్రీధర్, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఇరాన్‌ది ఎప్పటిలాగే అసత్య ప్రచారం’

- చమురు ట్యాంకర్ల పేలుడుపై అమెరికా



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
హర్మూజ్ జలసంధి లో సీమైన్‌ల ను ఢీకొట్టి రెండు చమురు ట్యాంకర్లు పేలినట్లు ఇరాన్ చేసిన ప్రకటనను అమెరికా ఖండించింది. ఎప్పటిలాగే ఐఆర్‌జీసీ అసత్య ప్రచారం చేస్తోందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ఎక్స్‌లో పోస్టు పెట్టింది. కాగా హర్మూజ్‌లో రాకపోకలను అమెరికా, ఇరాన్ దేశాలు నియంత్రిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన నౌకలపై ఈ రెండు దేశాల సైన్యాలు దాడులు చేస్తున్నాయి. ఈ క్రమంలో అమెరికా నిఘా సమాచారంపై ఆధారపడి వెళ్లిన రెండు నౌకలు సీమైన్స్‌ను ఢీకొట్టి పేలిపోయాయని ఐఆర్‌జీసీ వెల్లడించింది. తమ దేశంలోని యూఎస్ బేస్‌లు లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తుండటంతో కువైట్ విమాన కార్యకలాపాలను నిలిపివేసింది. అమెరికా సైనిక బలగాలకు ఆశ్రయం ఇస్తున్న దేశాలపై తమ దాడులు కొనసాగుతూనే ఉంటాయని మరోవైపు ఇరాన్ మీడియా వెల్లడించింది. ఆ దేశాలు తమ పౌరుల్ని రక్షించుకునే ప్రయత్నాలు చేసుకోవాలని సూచించింది.


## లాలూ యాదవ్‌కు అనారోగ్యం..

-ఈ రాత్రికి ఢిల్లీ ఎయిమ్స్‌కు..!



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
రాష్ట్రీయ జనతాదళ్ పార్టీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అస్వస్థతకు గురయ్యారు. దాంతో ఆయనను పట్నాలోని ఇందిరాగాంధీ వైద్య విజ్ఞానసంస్థ లో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం శనివారం ఢిల్లీ ఎయిమ్స్ కు తరలించనున్నారు. శుక్రవారం సాయంత్రం రక్తపోటు హెచ్చుతగ్గులకు గురికావడంతో ఆయనను పట్నాలోని ఇందిరా గాంధీ వైద్య విజ్ఞాన సంస్థలో చేర్పించారు. అక్కడ వైద్యపరీక్షలు నిర్వహించి అత్యవసర చికిత్స చేశారు. అనంతరం ఆరోగ్యం కుదుటపడటంతో డిశ్చార్జ్ చేశారు. ప్రస్తుతం ఇంట్లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచారు. అనంతరం తదుపరి వైద్య పరీక్షల కోసం లాలూని ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకెళ్తామని ఆయన పెద్ద కుమార్తె, ఆర్‌జేడీ ఎంపీ మిసా భారతి తెలిపారు. కాగా, లాలూ చాలాకాలంగా పలు ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. 2022 డిసెంబర్‌లో సింగపూర్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకున్నారు.

## రష్యాపై ఉక్రెయిన్ భీకర దాడి



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంలో ఉక్రెయిన్ తన వ్యూహాన్ని మార్చింది. రష్యా నిరంతర దాడులకు ధీటుగా కౌంటర్ ఇచ్చే క్రమంలో, ఆ దేశ అంతర్గత కీలక మౌలిక వసతులే లక్ష్యంగా ఉక్రెయిన్ సాయుధ బలగాలు విరుచుకుపడుతున్నాయి. రష్యా గుండెకాయ లాంటి రాజధాని మాస్కోతో పాటు టాంబోవ్ ప్రాంతాల్లోని రెండు ప్రధాన లాజిస్టిక్స్ కేంద్రాలపై తాము భీకర దాడులు నిర్వహించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోడిమిర్ జెలెన్స్కీ అధికారికంగా వెల్లడించారు. ఈ లాజిస్టిక్స్ కేంద్రాలను రష్యా సైన్యం డ్రోన్ల ఉత్పత్తికి మరియు యుద్ధ విమానాలు, క్షిపణుల నావిగేషన్ ఎక్విప్మెంట్ (దిక్సూచి పరికరాలు) సరఫరా కోసం వ్యూహాత్మకంగా ఉపయోగిస్తోందని, వాటిని దెబ్బతీయడం ద్వారా శత్రుదేశ సరఫరా వ్యవస్థను పక్షవాతానికి గురిచేశామని ఉక్రెయిన్ పేర్కొంది.

**ఆయిల్ ప్లాంట్‌పై దాడి- రష్యా ఆర్థిక మూలాలపై దెబ్బ**
మిలిటరీ స్థావరాలతో పాటు రష్యాకు ఆర్థికంగా ఇంధనాన్ని అందించే వనరులపై కూడా ఉక్రెయిన్ ఫోకస్ పెట్టింది. రష్యా ఆక్రమిత ఉక్రెయిన్ ప్రాంతంలో ఉన్న ఒక కీలకమైన ఆయిల్ ప్లాంట్‌పై కూడా తాము విజయవంతంగా దాడి చేసినట్లు జెలెన్స్కీ స్పష్టం చేశారు. ఈ దాడుల వల్ల రష్యా మిలిటరీ రవాణా సామర్థ్యం దెబ్బతినడమే కాకుండా, యుద్ధ క్షేత్రంలో ఉన్న రష్యా బలగాలకు ఆయుధాలు, ఇంధన సరఫరా నిలిచిపోయే ప్రమాదం ఏర్పడింది. రష్యా భూభాగంలోకి చొచ్చుకువెళ్లి మరీ ఉక్రెయిన్ డ్రోన్లు సృష్టిస్తున్న ఈ విధ్వంసం, అంతర్జాతీయంగా ఇరు దేశాల మధ్య యుద్ధ ఉద్రిక్తతలను మరింత గరిష్ట స్థాయికి చేర్చింది.ద

## ఆన్‌లైన్ అంగట్లో అశ్లీలత

-సోషల్ మీడియాలో విచ్చలవిడిగా లభ్యం

-రూ.50కే బాలల వేధింపు కంటెంట్



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, టెలిగ్రామ్ తదితర ప్రముఖ సోషల్ మీడియా వేదికల్లో బాలల లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్, అశ్లీల చిత్రాలు, తుపాకుల ప్రదర్శన లాంటి అసాంఘిక అంశాలు యథేచ్ఛగా కనిపిస్తున్నాయని ‘ఎన్‌డీటీవీ’ జరిపిన తాజా పరిశోధనలో తేలింది. ఇటువంటి కంటెంట్‌ను నిషేధించినప్పటికీ, ఆన్‌లైన్‌లోకి చొరబడుతుండటంపై ఆందోళన వ్యక్తమవుతోంది. రూ.50 చెల్లిస్తే, బాలల లైంగిక వేధింపులకు సంబంధించిన మెటీరియల్‌ను విక్రయించే చానళ్లను ఎన్డీటీవీ గుర్తించింది. దీనిపై సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ‘టెలిగ్రాం’ స్పందిస్తూ తాము 2026లో సుమారు 3.05 లక్షలకు పైగా ఇటువంటి చానళ్లను తొలగించామని, అధునాతన సాంకేతికతతో నిరంతరం నిఘా ఉంచుతున్నామని తెలిపింది. ఇదేవిధంగా ‘ఇన్‌స్టాగ్రామ్’లోనూ పిల్లలకు సంబంధించిన అశ్లీల చిత్రాలు, రెచ్చగొట్టే క్యాప్షన్లతో కూడిన వీడియోలు అందుబాటులో ఉన్నట్లు తేలింది. వీటిపై ప్రభుత్వం ఇప్పటికే మెటా సంస్థను వివరణ కోరింది. ఇటువంటి కంటెంట్‌ను వెంటనే నిలిపివేయాలని ఆదేశించింది. ఫేస్‌బుక్‌లో కృత్రిమమేధ సాయంతో సృష్టించిన అశ్లీల చిత్రాలు, మహిళలను కించపరిచేలా ఉన్న కంటెంట్ అపరిమితంగా ఉన్నట్లు తేలింది. ఇవేకాకుండా తుపాకులు, గ్యాంగ్ కల్చర్‌ను ప్రోత్సహించే వీడియోలు కనిపిస్తున్నాయి. ఇటువంటి ఉదంతాలపై మెటా సంస్థ స్పందిస్తూ, తమ ప్లాట్‌ఫామ్‌లలో లైంగిక దోపిడీ, అక్రమ కార్యకలాపాలకు తావులేదని, అటువంటి సమాచారం తమ దృష్టికి వచ్చిన వెంటనే తొలగిస్తున్నామని తెలిపింది.

# రంగురంగు పాపడాలను విక్రయించవద్దు

**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
భోజనంలో పాపడాలు, చిప్స్ లాంటివి తినడం చాలామందికి అలావాటే. వ్యాపారవేత్తలు తమ విక్రయాలు పెంచుకునేందుకు, భోజన ప్రియులను ఆకట్టుకునేందు రంగురంగు పాపడాలను తయారు చేస్తున్నారు. పింక్ కలర్ కావాలిన ఒకరు, ఆరెంజ్ కావాలని మరొకరు ఇలా తమకు నచ్చిన రంగు పాపడాలను తినాలంటే తమిళనాడులో ఇక కుదరదు. ఎందుకంటే ఆ రాష్ట్ర సీఎం జోసెఫ్ విజయ్ రంగు పాపడాల, , చిప్స్‌పై నిషేధం విధించారు.రంగు పాపడాల్లో ప్రమాదకరమైన రోడమైన్-బి రసాయన రంగులను అధికారులు గుర్తించారు. ఇది క్యాన్సర్‌కు కారణమయ్యే రసాయనం అని, దీనివల్ల ప్రజలు రోగాలబారిన పడకుండా ఉండేందుకు ఈ నిషేధం విధించారు. ఎవరైనా ఈ నిబంధనలు ఉల్లంఘించి ఈ



రసాయన రంగు పాపడాలను విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేసి, కఠిన చర్యలు తీసుకుంటామని సీఎం విజయ్ హెచ్చరిక జారీ చేశారు. కృత్రిమ రంగులు కలిపిన ఆహార పదార్థాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సీఎం సూచించారు. ఇటీవల తమిళనాడు ప్రభుత్వ ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు తనిఖీలు చేయగా ఆహార పదార్థాల్లో సురక్షితం కాని, నిషేధిత, అధిక మోతాదులో రోడమైన్-బి రసాయనం ఉన్నట్లు గుర్తించారు. ఈ రసాయనం కలిపిన ఉత్పత్తులను తినే పిల్లలు అలర్జీ, అటెన్షన్-డెఫిసిట్/హైపర్‌యాక్టివ్ డిజార్డర్ వంటి ఆరోగ్య సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఖీూణ హెచ్చరించింది. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చట్టం ప్రకారం రంగుల పాపడాలను తక్షణమే నిలిపివేయాలని తమిళనాడు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. మినపప్పు, వరి పిండి వంటి వాటితో స్వచ్ఛంగా తయారు చేసిన పాపడాలకే ప్రాధాన్యం ఇవ్వాలని ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులు సూచించారు.

# ‘ఒక్క వివాహం చేసుకున్నవాళ్లు మాత్రమే ఈ రాష్ట్రంలో ఉంటారు

**మధ్యప్రదేశ్ సీఎం సంచలన వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో నివసించాలంటే కేవలం ఒక్క వివాహం మాత్రమే చేసుకుని ఉండాలన్నారు. ఈ మేరకు త్వరలో యూనిఫామ్ సివిల్ కోడ్ ను అమలులోకి తెచ్చే యత్నం చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని పౌరులందరికీ ఒకే రకమైన చట్టం ఉండేలా చేయడమే దీని ఉద్దేశమని అన్నారు.రాబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోడ్‌ను ప్రవేశపెడుతుందని, అప్పుడు ఒకే వివాహం చేసుకున్న వారికి మాత్రమే రాష్ట్రంలో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుందని మధ్యప్రదేశ్




ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ నొక్కి చెప్పారు. కట్నీ జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలో మోహన్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. “ఒకే దేశం, ఒకే రాజ్యాంగం, ఒకే అధిపతి, ఒకే జెండా ఉండాల్సినప్పుడు, హిందువులకు, ముస్లింలకు వేర్వేరు చట్టాలు ఎందుకు ఉండాలి..? అందరికీ ఒకే చట్టం ఉండాలి. రామ్‌కు ఒకే వివాహం చేసుకునే అవకాశం ఉన్నప్పుడు, రహీమ్‌కు రెండు, మూడు లేదా నాలుగు వివాహాలు ఎందుకు ఉండాలి..? మన ముస్లిం సోదరీమణులు కూడా మన సోదరీమణులే. ప్రతిపాదిత ఉమ్మడి పౌర స్మృతి ప్రకారం, ఒకే వివాహం చేసుకున్న వ్యక్తికి మాత్రమే మధ్యప్రదేశ్‌లో నివసించే చట్టపరమైన హక్కు ఉంటుంది” అని తేల్చిచెప్పారు. రాబోయే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోడ్ బిల్లును ప్రవేశపెడుతుందని ఆ ప్రాతిపాదిత చట్టం ఏకరీతి న్యాయవ్యవస్థను అందిస్తుందని, తక్షణ ట్రిపుల్ తలాక్ యుగం ముగిసిందని సీఎం పేర్కొన్నారు. కాగా దేశంలో యూసీసీని చట్టబద్ధం చేసి, విజయవంతంగా అమలు చేసిన మొదటి రాష్ట్రంగా ఉత్తరాఖండ్ నిలిచింది. 2024 లోనే అసెంబ్లీలో బిల్లు పాస్ అవ్వగా.. 2025 జనవరి 27 నుండి ఈ చట్టం అధికారికంగా అమలులోకి వచ్చింది. వివాహాలు, విడాకులు, ఆస్తి హక్కులు, సహజీవనం వంటి అంశాలపై ఇక్కడ అందరికీ ఒకే చట్టం వర్తిస్తుంది.

# ప్లాస్టిక్ నోట్ల దిశగా ఆర్బీఐ అడుగులు

**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
దేశంలో మరింత సురక్షితమైన, భద్రత కలిగిన నోట్లను (ప్లాస్టిక్) తెచ్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తొలిదశలో రూ.10, రూ.20 నోట్లపై పైలట్ ప్రాజెక్టును చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించింది. ఇందుకోసం అవసరమైన ప్రత్యేక పాలిమర్ సబ్‌స్ట్రేట్ సరఫరాకు ఆర్బీఐ అనుబంధ సంస్థ భారతీయ రిజర్వ్ బ్యాంక్ నోట్ ముద్రణ్ ప్రైవేట్ లిమిటెడ్ (బీఆర్‌బీఎన్‌ఎంపీఎల్) గ్లోబల్ ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్ (ఈఓఐ)ను ఆహ్వానించింది. అత్యున్నత భద్రతా ప్రమాణాలతో కూడిన ఒపాసిఫైడ్ క్రిటికాలిటీని కలిగివుండే పాలిప్రొపైలిన్ (ఓపీపీ) పాలిమర్ సబ్‌స్ట్రేట్ కోసం ఈ టెండర్లను విడుదల చేసింది. రెండు రకాల దీర్ఘాయుష్షు కలిగిన 68 వేల రీములను మెటీరియల్ అవసరమని పేర్కొంది. శిక్షణ లాట్లకు ఆగస్టు 18ను గడువుగా నిర్ణయించింది.

మొదట రూ.10, రూ.20 నోట్లపై ప్రయోగం
విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం .... ఎక్కువగా చలామణిలో ఉండే రూ.10, రూ.20 నోట్లతోనే పైలట్ ప్రాజెక్టును ప్రారంభించే అవకాశముంది. ఈ నోట్లు త్వరగా చిరిగిపోవడం, వినియోగంతో నాణ్యత కోల్పోవడం వల్ల వీటినే ముందుగా ఎంపిక చేసినట్లు తెలుస్తోంది. వచ్చే ఏడాది ఫీల్డ్ ట్రయల్స్ నిర్వహించి, అవి విజయవంతమైతే



2027 నుంచి దశలవారీగా ప్లాస్టిక్ నోట్లను విస్తృతంగా చలామణిలోకి తీసుకురావాలని ఆర్బీఐ భావిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు.

ముద్రణ వ్యయం తగ్గించడమే లక్ష్యం ....
ప్రస్తుతం దేశంలో వాడుతున్న కరెన్సీ నోట్లు 100 శాతం పత్తి ఆధారిత కాగితంతో ముద్రిస్తున్నారు. రోజువారీ వినియోగంలో ఇవి త్వరగా చిరిగిపోవడం, మురికిగా మారడం వల్ల భారీ సంఖ్యలో పాత నోట్లను ఉపసంహరించి కొత్త నోట్లు ముద్రించాల్సి వస్తోంది. దీంతో కరెన్సీ ముద్రణ వ్యయం ఏటా పెరుగుతోంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో కరెన్సీ ముద్రణపై రూ.6,372.8 కోట్లు ఖర్చు కాగా, అంతకుముందు ఏడాది ఇది రూ.5,101.4 కోట్లుగా నమోదైంది.

పాలిమర్ నోట్ల ప్రయోజనాలు ....
పాలిమర్ నోట్లు సాధారణ కాగితం నోట్లతో పోలిస్తే రెండు నుంచి ఐదు రెట్లు ఎక్కువ కాలం మన్నుతాయి. దీంతో ముద్రణ, పంపిణీ ఖర్చులు దీర్ఘకాలంలో తగ్గే అవకాశం ఉంది. అంతేకాకుండా ఇవి నీరు, మురికికి తట్టుకునే లక్షణం కలిగి ఉండటంతో పాటు, ‘క్లియర్ విండో’ వంటి ఆధునిక భద్రతా ఫీచర్ల కారణంగా నకిలీ చేయడం కూడా కష్టతరమవుతుంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, బ్రిటన్, కెనడా సహా 50కిపైగా దేశాలు పాలిమర్ కరెన్సీని విజయవంతంగా వినియోగిస్తున్నాయి.

గతంలోనూ ప్రయత్నం ....
భారత్‌లో ప్లాస్టిక్ నోట్ల ప్రయోగం కొత్తది కాదు. 2012లో రూ.10 ప్లాస్టిక్ నోట్లను కొచ్చి, మైసూరు, జైపూర్ తదితర నగరాల్లో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టాలని ప్రతిపాదించినప్పటికీ సాంకేతిక కారణాలతో ఆ ప్రణాళిక అమలుకాలేదు.

కఠిన నిబంధనలు ....
తాజా టెండర్లలో ఆర్బీఐ పలు కఠిన నిబంధనలు విధించింది. చైనా, పాకిస్తాన్‌లలో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలకు టెండర్లలో పాల్గొనే అర్హత ఉండదని స్పష్టం చేసింది. అలాగే ఆయా దేశాల నుంచి ముడిసరుకును సేకరించకూడదని పేర్కొంది. సరఫరా చేసే పాలిమర్ మెటీరియల్‌లో జంతువుల కొవ్వు ఉండకూడదనే షరతును కూడా విధించింది.

## బద్రీనాథ్‌లోనూ భారీగా విరాళాల చోరీ

-సీసీటీవీ ఫుటేజ్‌లో గుర్తింపు


-మాజీ అధికారి అరెస్ట్



**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**
ఉత్తరాఖండ్ చమోలి జిల్లాలోని పవిత్ర బద్రీనాథ్ ధామ్‌లో విరాళాల అక్రమాలపై ప్రత్యేక దర్యాప్తు సంస్థ (సిట్) తన దర్యాప్తును వేగవంతం చేసింది. తాజాగా బద్రీనాథ్-కేదార్‌నాథ్ ఆలయ కమిటీ (బీకేటీసీ) మాజీ అధికారి, విరాళాల లెక్కింపు మాజీ ఇన్‌చార్జి రాజేంద్ర సింగ్ చౌహాన్‌ను సిట్ అరెస్ట్ చేసింది. జోషిమఠ్‌లోని న్యాయస్థానం ముందు శనివారం అతడిని హాజరుపర్చగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపారు.ఆలయ సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన దర్యాప్తు బృందానికి విరాళాల నిర్వహణ వ్యవస్థపై పలు సందేహాలు తలెత్తాయి. లభ్యమైన 13 రోజల ఫుటేజ్‌ను సిట్ పరిశీలించగా ప్రతి రోజు కట్టల కట్టల కరెన్సీ, బంగారం, వెండిని కొందరు అపహరిస్తున్న దృశ్యాలు రికార్డు అయ్యాయి. ఇంకా 32 రోజుల సీసీటీవీ ఫుటేజ్ అదృశ్యమైనట్టు గుర్తించారు. దర్యాప్తులో భాగంగా నిందితుని వద్ద నుంచి కుంకుమ పువ్వు, ఇతర వస్తువులు, విదేశీ కరెన్సీని స్వాధీనం చేసుకున్నారు. ఆలయ ప్రాంగణానికి బదులు బ్యాంక్ ప్రాంగణంలో విరాళాలను లెక్కించారన్న ఆరోపణలపై కూడా సిట్ దర్యాప్తు చేస్తున్నది. దీనిలో బ్యాంక్ అధికారుల పాత్ర గురించి ఆరా తీస్తున్నది.

## సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాలు విడుదల

**న్యూఢిల్లీ (జర్నలిస్టు డైరీ) జూలై 18**



సీబీఎస్ఈ పదో తరగతి రెండో బోర్డ్ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. 2026 నుంచే పదో తరగతిలో రెండు బోర్డు పరీక్షలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ప్రధాన బోర్డు పరీక్ష ఫిబ్రవరి 17 నుంచి మార్చి 11 దాకా జరగ్గా.. రెండో బోర్డు పరీక్ష మే 15 నుంచి 21 దాకా నిర్వహించారు. 6,64,027 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా..6,63,777 మంది పరీక్షకు హాజరయ్యారు. ఇందులో 5,13,955 మంది తమ మార్కులను మెరుగు పరుచుకోడానికి పరీక్ష రాశారు. 59.95 శాతం మంది అంటే 3,08, 095 మంది ప్రధాన పరీక్షతో పోలిస్తే మెరుగైన ఫలితాలు సాధించారు. కంపార్ట్‌మెంట్ విభాగం కింద మొత్తం 1,49,822 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా.. ఇందులో 78,503 మంది ఉత్తీర్ణులయ్యారు. రెండు బోర్డు పరీక్షల ఫలితాలను కలపగా.. పదో తరగతిలో మొత్తం 96.78 శాతం ఉత్తీర్ణత నమోదైంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# ఏఐ ఆధారిత "డేటా సెంటర్ల"తో లాభ-నష్టాలు:ఒక విశ్లేషణ

కృత్రిమ మేధ (ఏఐ) విప్లవంతో ప్రపంచవ్యాప్తంగా డేటా సెంటర్ల ప్రాముఖ్యత వేగంగా పెరుగుతోంది. క్లౌడ్ సేవలు, బ్యాంకింగ్, ఈ-కామర్స్, ప్రభుత్వ డిజిటల్ సేవలు, పరిశోధనలు ఇవన్నీ భారీ డేటా సెంటర్లపై ఆధారపడి ఉన్నాయి. అయితే అమెరికా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, సింగపూర్ వంటి దేశాలు డేటా సెంటర్ల విస్తరణపై పరిమితులు విధిస్తున్నాయి. కారణం వాటి వల్ల పెరుగుతున్న విద్యుత్ వినియోగం, నీటి వినియోగం, కార్బన్ ఉద్గారాలు, పర్యావరణంపై పడుతున్న భారం. కానీ భారత్‌లో మాత్రం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీ రాయితీలు, భూములు, పన్ను మినహాయింపులతో డేటా సెంటర్లను పోటీపడి ఆహ్వానిస్తున్నాయి. నీరు, విద్యుత్తు కొరతతో పాటు పర్యావరణ ఒత్తిళ్లు అధికంగా ఉన్న దేశంలో ఈ విధానం ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నకు శాస్త్రీయంగా సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది.ప్రస్తుతం ప్రపంచంలో సుమారు పదకొండు వేలకుపైగా డేటా సెంటర్లు ఉన్నాయి. అమెరికాలోనే ఐదు వేలకుపైగా ఉండగా, జర్మనీ, యునైటెడ్ కింగ్‌డమ్, చైనా, ఫ్రాన్స్, కెనడా, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. భారత్‌లో ప్రస్తుతం రెండు వందల యాభై నుంచి మూడు వందల మధ్య పెద్ద డేటా సెంటర్లు పనిచేస్తున్నాయి. వీటి కోసం ముంబై, చెన్నై, హైదరాబాద్, నోయిడా, బెంగళూరు ప్రధాన కేంద్రాలుగా పోటీపడుతున్నాయి. రాబోయే రోజుల్లో ఈ రంగంలో పెట్టుబడులు మరింత పెరిగే అవకాశం ఉందని పరిశ్రమ అంచనా వేస్తోంది.డేటా సెంటర్లలో అత్యంత కీలక సమస్య విద్యుత్ వినియోగం. ఏఐ ఆధారిత డేటా సెంటర్లు వందల మెగావాట్ల విద్యుత్తును నిరంతరం వినియోగిస్తాయి. అంతర్జాతీయ శాస్త్రవేత్తల అంచనాల ప్రకారం ఈ విద్యుత్ వినియోగం రాబోయే సంవత్సరాల్లో భారీగా పెరగనుంది. ఇప్పటికే భారత్‌లో వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ రికార్డు స్థాయికి చేరుతోంది. అలాంటి పరిస్థితిలో పెద్ద ఎత్తున డేటా సెంటర్లకు చౌక విద్యుత్తు అందించడం మిగిలిన రంగాలపై ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది.రెండో ప్రధాన సమస్య నీటి వినియోగం. డేటా సెంటర్లలోని సర్వర్లను చల్లబరచడానికి భారీ మొత్తంలో నీరు అవసరమవుతుంది. పెద్ద డేటా సెంటర్లు రోజుకు లక్షల లీటర్ల నీటిని వినియోగించే అవకాశం ఉంది.
ఇప్పటికే భారతదేశంలోని అనేక నగరాలు తాగునీటి



కొరతను ఎదుర్కొంటున్నాయి. తలసరి నీటి లభ్యత కూడా గత కొన్ని దశాబ్దాలుగా తగ్గుతోంది. ఇలాంటి సమయంలో పరిశ్రమల కోసం విలువైన నీటి వనరులను మళ్లించడం భవిష్యత్తులో సామాజిక, పర్యావరణ సమస్యలను మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉంది.
ఉద్యోగాల విషయంలో కూడా వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోవాలి. డేటా సెంటర్ల నిర్మాణ దశలో తాత్కాలికంగా వేలాది ఉద్యోగాలు లభించినా, నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణకు సాధారణంగా కొన్ని వందల మంది నిపుణులు మాత్రమే అవసరమవుతారు. వాటిలో అధిక భాగం అధిక నైపుణ్యం కలిగిన ఇంజినీర్లు, నెట్‌వర్క్ నిపుణులు, విద్యుత్ మరియు శీతలీకరణ సాంకేతిక నిపుణులకే పరిమితం అవుతాయి. అందువల్ల లక్షలాది మంది యువతకు ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ప్రచారం నిజం కాదు.
అయితే డేటా సెంటర్ల వల్ల ప్రయోజనాలు లేవా అంటే ఖచ్చితంగా కొన్ని ఉన్నాయి. దేశీయంగా డేటా నిల్వ చేయడం వల్ల డేటా భద్రత, డిజిటల్ సార్వభౌమత్వం బలోపేతమవుతాయి. క్లౌడ్ సేవలు, ఫిన్‌టెక్, ఈ-కామర్స్, ఆరోగ్యం, విద్య, కృత్రిమ మేధ పరిశోధనలకు అవసరమైన మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందుతాయి. విదేశీ పెట్టుబడులు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అయితే ఈ ప్రయోజనాలను ఖర్చులతో పోల్చి చూడడం అవసరం.ఈ రంగంలో అత్యధిక లాభం పొందేది ప్రధానంగా ప్రపంచ క్లౌడ్ కంపెనీలు, పెద్ద సాంకేతిక సంస్థలు, పెట్టుబడిదారులు, డేటా సెంటర్ నిర్వహణ సంస్థలే. ప్రభుత్వాలు వారికి భూములు, పన్ను రాయితీలు, చౌక విద్యుత్తు వంటి ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. మరోవైపు నీటి కొరత, విద్యుత్ ఒత్తిడి, పర్యావరణ నష్టం, ప్రభుత్వ రాయితీల ఆర్థిక భారం వంటి ప్రభావాలను సమాజమే భరించాల్సి వస్తుంది. అంటే లాభాలు కొద్దిమందికి కేంద్రీకృతమయ్యే అవకాశం ఉండగా, ఖర్చు మాత్రం సమాజమంతా పంచుకోవాల్సి వస్తుంది.
ఇదే కారణంగా అనేక దేశాలు నియంత్రణ విధానాలను అనుసరిస్తున్నాయి. ఐర్లాండ్‌లో విద్యుత్ వ్యవస్థపై ఒత్తిడి కారణంగా కొత్త డేటా సెంటర్ల అనుమతులపై కఠిన నిబంధనలు అమలులోకి వచ్చాయి. సింగపూర్ కొంతకాలం కొత్త అనుమతులను నిలిపివేసి, తర్వాత అధిక శక్తి సామర్థ్య ప్రమాణాలతోనే అనుమతులు ఇచ్చింది. నెదర్లాండ్స్ కూడా కొన్ని ప్రాంతాల్లో పరిమితులు విధించింది. అభివృద్ధిని వ్యతిరేకించడం కాకుండా, పర్యావరణ సామర్థ్యానికి అనుగుణంగా నియంత్రించడం వారి విధానం.భారత్‌లో కూడా ప్రతి ప్రాజెక్టుకు నీటి లభ్యత, విద్యుత్ సామర్థ్యం, పునరుత్పాదక ఇంధన వినియోగం, మురుగునీటి పునర్వినియోగం, కార్బన్ ఉద్గారాల నియంత్రణ, స్థానిక యువతకు ఉపాధి కల్పన వంటి ప్రమాణాలను తప్పనిసరి చేయాలి. ముఖ్యంగా తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో డేటా సెంటర్ల అనుమతుల విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం. డిజిటల్ ఆర్థిక వ్యవస్థకు డేటా సెంటర్లు అవసరమే. కానీ అభివృద్ధి పేరిట నీరు, విద్యుత్, భూమి వంటి పరిమిత వనరులను విచక్షణారహితంగా వినియోగించడం మన దేశ ప్రయోజనాలకు అనుకూలం కాదు. పర్యావరణ పరిరక్షణ, ప్రజా వనరుల సమర్థ వినియోగం, ఉపాధి ప్రయోజనాలు, ఆర్థిక అభివృద్ధి... ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే డేటా సెంటర్లు నిజమైన జాతీయ ఆస్తిగా మారతాయి. లేకపోతే కొద్దిమంది పెట్టుబడిదారులకోసం మన దేశ వనరులను త్యాగం చేయటం సముచితం కాదు.

**డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.**
ramkishore.1504@gmail.com

# చెరువుల సుందరీకరణ చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :**
శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల చెరువుల సుందరీకరణ మరియు చేపట్టవలసిన పలు అభివృద్ధి పనుల పై ఇరిగేషన్ అధికారులు మరియు తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి సమీక్షా సమావేశం జరిపిన పియేసి చైర్మన్ ఆరెక పూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గంలో గల చెరువుల సుందరికరణ, సంరక్షణ,అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని, చెరువుల సుందరీకరణ పనులలో జాప్యం లేకుండా చూడాలని, పెండింగ్ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని, వర్షాకాలం ను దృష్టిలో పెట్టుకొని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని,పనులలో అలసత్వం ప్రదర్శించకూడదు అని అధికారులకు తెలియచేశారు. అదేవిధంగా చెరువు లో మురుగు నీరు కలవకుండా డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులలో వేగం పెంచాలని,పనులు నాణ్యత ప్రమాణాల తో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు.చెరువులను ను సుందర శోభిత వనంగా తీర్చిదిద్దుతామని, చెరువులను అన్ని రంగాలలో అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని,చుట్టుపక్కల కాలనీ వాసులు , వాకర్స్ కి ఇబ్బంది లేకుండా చూస్తామని, వాకర్స్ ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసుకోవడానికి వీలుగా అన్ని రకాల మౌలిక వసతులు కల్పిస్తామని తెలియచేశారు . చక్కటి ఆహ్లాదకమైన వాతావరణం కల్పిస్తామని , వర్షాకాలం లో వచ్చే వరద నీటి నీ ఒడిసిపట్టుకోవాలని, చెరువు ఇన్ లెట్ లో చెత్త చెదారం లేకుండా చూడాలని, ఇన్ లెట్ ,ఔట్ లెట్ లను సరి చేయాలని,నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని,చెరువు చుట్టు జరుగుతున్న ఫెన్సింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, , చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని,అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలని,పనులు నాణ్యత ప్రమాణాల తో



చేపెట్టాలని,నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని తెలియచేసారు, చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు ,చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా సస్యశ్యామలం గా , చక్కటి ఆహ్లాదకరం గా చెరువు ను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని , చెరువు చుట్టూ పక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో సాంత్వన నేటితో చేకూరింది అని తెలియచేసారు , ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని పనులు వేగవంతం చేయాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని తెలియచేసారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్దరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువుల సుందరికరణ పనులు చేపడుతున్నాం అని ,చెరువుల సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని తెలియచేసారు . అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు.
చెరువు ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది .చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ,చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని , చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి , ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారులు డిఈ ఉదయ్ భాస్కర్, ఏఈ రవి కుమార్, ఏఈ లింగప్ప తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఎల్వోసీ పత్రాలను అందజేసిన గాంధీ



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :**
కొండాపూర్ డివిజన్ పరిధిలోని సఫారీ నగర్ చెందిన అనిల్ కి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్ కు దరఖాస్తు చేసుకొనగా ముఖ్య మంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 2,50,000/- రెండు లక్షల యాభై వేల రూపాయల ఆర్థిక సహాయానికి సంబందించిన మంజూరి పత్రాన్ని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ తో కలిసి బాధిత కుటుంబానికి అందచేసిన ఆరెకపూడి గాంధీ.ఈ సందర్భంగా గాంధీ గారు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరం అని, ప్రజాక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పునరుద్ఘాటించారు . అదేవిధంగా ముఖ్యమంత్రి సహాయ నిధి నిరంతరం సేవలను అందిస్తూ ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటున్నదని, అనారోగ్యంకు గురై ఆర్థిక స్తోమత లేక ఆసుపత్రిలో చికిత్స పొందిన నిరుపేదలకు , అభాగ్యులకు అండగా..సీఎం సహాయ నిధి ఆర్థిక భరోసా నిస్తుందని.. ఈ సందర్భంగా తెలియచేశారు.ఈ సందర్భంగా వైద్య చికిత్స కి సహకారం అందించిన చైర్మన్ ఆరెకపూడి గాంధీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేస్తున్నాము అని బాధిత కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇబ్రహీం, మారెళ్ళ శ్రీనివాస్ ,అశోక్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# భాగ్యలత కాలనీలో డ్రైనేజీ పనులను పరిశీలించిన బీజేపీ నాయకుడు లక్ష్మణ్





**జర్నలిస్ట్ డైరీ హయత్నగర్ జులై 18:-**
ఎల్ బి నగర్ నియోజకవర్గం హయత్నగర్ మండలం భాగ్యలత కాలనీ పరిధిలోని అరుణోదయనగర్ రోడ్డు నెంబర్ 3 లో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను బీజేపీ నాయకుడు లక్ష్మణ్ పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలతో మాట్లాడి కాలనీలో ఎదుర్కొంటున్న డ్రైనేజీ సమస్యలను ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం పనుల నాణ్యతను పరిశీలించి డ్రైనేజీ పనులను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి కాలనీ వాసుల ఇబ్బందులను తొలగించాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు అధికారులకు సూచించారు.వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మురుగునీరు సజావుగా సాగిపోయేలా శాశ్వత పరిష్కారం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కాలనీవాసులు పాల్గొన్నారు.

# రైతుల అక్రమ అరెస్టులకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి నిరసన..

## నందిగామ పోలీస్ స్టేషన్ ఎదుట బీఆర్ఎస్ ఆందోళన



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :**
రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ ఎన్. నవీన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరసన చేపట్టారు. రైతుల తరఫున పోరాటం చేస్తున్న రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ కార్తీక్ రెడ్డిని, అలాగే భూముల సమస్యపై ఆందోళన చేస్తున్న రైతులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై కేసులు నమోదు చేసి అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని విమర్శించారు. రైతుల హక్కుల కోసం పోరాడుతున్న నాయకులను అణచివేయాలని ప్రయత్నించడం సరైన విధానం కాదని అన్నారు. రైతులపై నమోదు చేసిన కేసులను వెంటనే ఎత్తివేసి, అరెస్టు చేసిన వారిని బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. రైతుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

# నిరుద్యోగులను విస్మరించిన కాంగ్రెస్ సర్కార్..

-ఇచ్చిన మాట నిలబెట్టుకోలేని కాంగ్రెస్ సర్కార్

-యువత చేతుల్లోని రాష్ట్ర భవిష్యత్..

-యువతకు అండగా బిఆర్ఎస్ ..

ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి..

-భారీ సంఖ్యలో సరూర్ నగర్ లోని సంగ్రామా సదస్ కు తరలిన గులాబీ శ్రేణులు..



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :** ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పేందుకు యువత సిద్ధం కావాలని, యువత చేతిలోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.. ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా, యువతను విస్మరిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు శనివారం హైదరాబాద్ సరూర్ నగర్లో కేటీఆర్ ఆధ్వర్యంలో తలపెట్టిన యువ సంగ్రామ సదస్సుకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆధ్వర్యంలో గులాబీ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు.. ఇందులో బాగానే ముందుగా షాద్నగర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి ఆయన గులాబీ శ్రేణులతో కలిసి సదస్కు తరలి వెళ్లారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగులను, యువతను విస్మరిస్తున్న ఈ ప్రభుత్వానికి తగిన గుణపాఠం నేర్పాలి అన్నారు.. యువత భవిష్యత్ కేసిఆర్, కేటీఆర్ చేతుల్లోనే కలదని, మరోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి చేసే వరకు యువత కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు చేతకాని ప్రభుత్వంనకు ఓటుతో బుద్ధి చెప్పేందుకు ప్రజలు సర్వదా సిద్ధమయ్యారన్నారు.. యువ సంగ్రామ సదస్సుకు తరలి వెళ్లేందుకు బీ ఆర్ ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్, బుచ్చిగూడ వెంకట్ రెడ్డి భారీగా విచ్చేసిన పట్టణ కౌన్సిలర్లకు,సర్పంచులు, మాజీ ప్రజాపతినిధులు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు యువత ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి

**- బీఆర్ఎస్ నాయకుడు మామిడి రామచందర్..**



**జర్నలిస్ట్ డైరీ, ఎల్బీనగర్:** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు యువత ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ బీఆర్ఎస్ వీ ఆధ్వర్యంలో శనివారం సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకుకు కొత్తపేట డివిజన్ భరత్ నగర్. రాజీవ్ గాంధీ నగర్ ఇతర ప్రాంతాల నుండి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి రాంచందర్ ఆధ్వర్యంలో యువకులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఈ సందర్భంగా మామిడి రాంచందర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ యువతకు అములకు నోచుకొని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు ఆదులు చేయాలేదని అన్నారు. యువత ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. మహేందర్. కె. కుమార్. మల్లేష్, అశోక్, శివ, నరేష్. సాంబయ్య, శివరాత్రి ఆశోక్, మల్లేష్ యాదవ్, సాయి తదితరులు పాల్గొన్నారు.

-బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మామిడి రామచందర్ ఆధ్వర్యంలో యువ సంగ్రామ సదుస్సకు వెళుతున్న యువకులు..

## వికారాబాద్‌కు వరాల జల్లు: రూ. 261 కోట్లతో భారీ అభివృద్ధి పనులకు శంకుస్థాపన!



**జులై 18,వికారాబాద్ నియోజకవర్గం.జర్నలిస్ట్ డైరీ** రోడ్ల భవనాలు శాఖ ఆద్వర్యంలో రూ. 261 కోట్లతో వికారాబాద్ నియోజకవర్గంలో చేపట్టే పనులకు వికారాబాద్ పట్టణం, శివారెడ్డి పేట్ లోని RTO కార్యాలయంలో ఈరోజు శంఖుస్థాపన చేసిన తెలంగాణ రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ గడ్డం ప్రసాద్ కుమార్ గారు, రాష్ట్ర రోడ్లు & భవనాలు శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు రంగారెడ్డి జిల్లా ఇంచార్జి మంత్రి శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్ బాబు గపాల్గొన్న కౌన్సిల్ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఫ్రీ కొండా విశ్వేశ్వరరెడ్డి, చేవెళ్ల, తాండూరు శాసనసభ్యులు కాలే యాదయ్య, బి. మనోహర్ రెడ్డి, మీాజ అంజిరెడ్డి, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, SP స్నేహా మెహ్రా, వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్ అర్ధ సుధాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు.

**ఈసందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గారు మాట్లాడుతూ..**

ముఖ్యమంత్రి నియోజకవర్గ స్థాయిలో స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న వికారాబాద్ ను అభివృద్ధి చేస్తానని శ్రీ రేవంత్ రెడ్డి గారు ఇచ్చిన మాట ప్రకారం రోడ్ల అభివృద్ధికి పెద్ద ఎత్తున నిధులు ఇచ్చినందుకు వారికి నా ధన్యవాదాలు.

# సుందరీకరణ పనులను పరిశీలించిన గాంధీ

**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :** ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులలో భాగంగా రూ. 2 కోట్ల 74 లక్షల రూపాయల అంచనావ్యయం తో చెరువులో మురుగు నీరు కలవకుండా చేపడుతున్న మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులను మరియు చెరువు సుందరీకరణ పనులను పరిశీలించిన పియేసి చైర్మన్ శ్రీ ఆరెకపూడి గాంధీ.

ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ... ఎల్లమ్మ చెరువు సుందరికరణ, సంరక్షణ, అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుంది అని, చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపట్టిన డ్రైనేజీ వ్యవస్థ మళ్లింపు లో భాగంగా పైప్ లైన్ వద్ద ప్రతి మ్యాన్ హోల్ లో పేరుక పోయిన చెత్త, చెదారం ను వెంటనే తోగించాలని, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలని, నీటి ప్రవాహం కు అడ్డంకులను తొలగించాలని, పైప్ లైన్ లో నీటి ప్రవాహం సాఫీగా సాగేలా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని తెలియచేశారు.చెరువు లో కలుషిత నీరు కలవకుండా చేపడుతున్న డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజి వ్యవస్థ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనులకు వేగం పెంచాలని,పనులు నాణ్యత ప్రమాణాల తో చేపెట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని తెలియచేసారు, చుట్టుపక్కల కాలనీల నుండి వచ్చే మురుగు నీరు చెరువులో కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ప్రజలకు , చెరువు చుట్టుపక్కల నివసిస్తున్న కాలనీ వాసులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూడలని, మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ ద్వారా చెరువులో కలుషిత నీరు కలవకుండా



సస్యశ్యామలం గా , చక్కటి ఆహ్లాదకరం గా చెరువు ను పూర్తి స్థాయిలో తీర్చిదిద్దుతామని , చెరువు చుట్టూ పక్కల కాలనీల ప్రజలకు ఎంతగానో సాంత్వన నేటితో చేకూరింది అని తెలియచేసారు , ప్రజల ఇబ్బందులను పరిగణలోకి తీసుకుని పనులు వేగవంతం చేయాలని, పనులు నాణ్యత ప్రమాణాల తో చేపట్టాలని తెలియచేసారు. అదేవిధంగా చెరువు సుందరికరణ లో భాగంగా చెరువు కట్ట పటిష్టం పరిచేలా పునరుద్ధరణ , మురుగు నీరు చెరువు లో కలవకుండా ప్రత్యేకంగా చెరువు చుట్టూ నిర్మించే మురుగు నీటి మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం మరియు అలుగు మరమ్మత్తులు, చెరువు కట్ట బలోపేతం ,పునరుద్ధరణ పనులు, వాకింగ్ ట్రాక్ వంటి పనులు చేపడుతామని తెలియచేసారు. చెరువు సంరక్షణ లో భాగంగా చెరువు చుట్టూ ఫెన్సిగ్ (కంచె) నిర్మాణం మరియు చెరువు యొక్క అలుగు నిర్మాణము మరియు చెరువు సుందరికరణ పనులు చేపడుతున్నాం అని , చెరువు సుందరికరణ మరియు అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో కి తీసుకురావాలని అధికారులకు తెలియచేశారు అదేవిధంగా ప్రణాళిక తో పనులు చేపట్టాలని తెలియచేసారు . అదేవిధంగా చెరువులను సంరక్షణిచడమే ధ్యేయంగా పనిచేస్తున్నాం అని అన్నారు. అదేవిధంగా ఎల్లమ్మ చెరువును సుందరవనం గా , శోభితవర్ణం గా తీర్చిదిద్దుతామని, అదేవిదంగా చెరువు ల చుట్టూ వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేసి చెరువు ల ను సంరక్షిస్తామని తెలియచేసారు . చెరువు ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మళ్లింపు పైప్ లైన్ నిర్మాణం పనుల గూర్చి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగినది .

చెరువు అపరిశుభ్రం వలన పేరుకుపోయిన గుర్రపు డెక్క వలన దోమల పెరగడం వలన స్థానికులకు ఏర్పడుతున్న ఇబ్బందులను ,అనారోగ్యాలకు గురవడం స్థానికులు పలుమార్లు ఎమ్మెల్యే కి పిర్యాదు చేయడం వలన దీనికి స్పందించిన చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క ను తొలగించి, చెరువును శుభ్రపరిచి సుందరీకరణ చేసిన సంగతి విదితమే . అదేవిధంగా ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని చెప్పడం జరిగినది , తామర పువ్వులను పెంచి కలుషితం కాకుండా చెరువును సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది . చెరువులను సుందరీకరించి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని , చెరువులు కలుషితం కాకుండా మరియు కబ్జాలకు గురికాకుండా చెరువులను పూర్తి స్థాయి లోసంరక్షిస్తామని , చెరువు చుట్టూ పెన్సింగ్ ఏర్పాటు చేసి వాకింగ్ ట్రాక్ ను ఏర్పాటు చేసి , ప్రజలకు చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణాన్ని అందిస్తామని, అలాగే నియోజకవర్గం లోని అన్ని చెరువులను పూర్తి స్థాయిలో సుందరీకరిస్తామని చెప్పటం జరిగినది చెరువుల పరిరక్షణకు పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటామని తెలియచేసారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్, జలమండలి సూపర్ వైజర్ శివ నాయకులు ఇబ్రహీం, రాజిరెడ్డి , గణేష్ మరియు తదితరులు పాల్గొన్నారు.

# వరి సాగులో నీటి పొదుపు పద్ధతులపై రైతులకు అవగాహన

**ఎల్ నినో ముప్పు నేపథ్యంలో చల్లాపూర్ రైతు వేదికలో రైతులకు అవగాహనా సదస్సు**

**జర్నలిస్ట్ డైరీ కొడంగల్ జులై 18:-** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం చల్లాపూర్ గ్రామ రైతు వేదికలో వాసన్ ఫౌండేషన్ వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు శాస్త్రీయ నీటి యాజమాన్య పద్ధతులపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం కారణంగా వర్షపాతం లోపించే ముప్పు ఉన్న నేపథ్యంలో వరి పంటలో ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (AWD) పద్ధతి ప్రాధాన్యతను రైతులకు అధికారులు వివరించారు.వరి పొలంలో ఎల్లప్పుడూ నీరు నిల్వ ఉంచకుండా అవసరమైన సమయంలో మాత్రమే నీరు పెడుతూ మధ్యలో నేల కొంతకాలం తడిగా-పొడిగా మారేలా నిర్వహించే శాస్త్రీయ విధానమే ఈ ఆల్టర్నేట్ వెట్టింగ్ అండ్ డ్రైయింగ్ (AWD) పద్ధతి అని దీనివల్ల దిగుబడి తగ్గకుండానే భారీగా నీటిని ఆదా చేయవచ్చని నిపుణులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా ప్రస్తుత వర్షపాత పరిస్థితి నీటిపారుదల వనరుల లభ్యత బోర్‌వెల్ నీటి పరిస్థితిపై రైతులకు అవగాహన కల్పిస్తూ తగినంత నీటి వనరులు ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే పంటలు విత్తాలని నీటి వసతి లేకపోతే పంటలు వేయవద్దని స్పష్టం





చేశారు.ఒకవేళ పంట వేయాలనే పట్టుదలతో ఉంటే తక్కువ నీటితో సాగు చేయగల మెట్ట పంటలను ఎంచుకోవాలని సూచించారు.నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో వరి సాగును నిరుత్సాహపరుస్తూ దానికి బదులుగా జొన్న సజ్జ రాగి పెసర మినుము కంది శనగ వంటి తక్కువ నీటి అవసరమున్న పంటలను సాగు చేయడం ద్వారా నీటిని పొదుపు చేసుకోవడంతో పాటు స్థిరమైన ఆదాయం పొందవచ్చని మార్గనిర్దేశం చేశారు.ఇదే సమయంలో ఎల్ నినో ప్రభావాలు ప్రమాదాలను ముందుగానే తెలియజేస్తూ రైతులకు పలు అత్యవసర నిర్వహణ చర్యలను సూచించారు.అందులో భాగంగా నీటిని ఎక్కువగా వినియోగించే కలుపు మొక్కలను వెంటనే తొలగించి తేమను సంరక్షించాలని గడ్డి లేదా పంట అవశేషాలతో నేలను కప్పి (మల్చింగ్) తేమ ఆవిరైపోకుండా చూడాలని తెలిపారు.నీరు అందుబాటులో ఉంటే పంట కీలక దశల్లో మాత్రమే తక్కువ మోతాదులో రక్షణాత్మక నీటిపారుదల అందించాలని వ్యవసాయ అధికారుల సూచనల మేరకు 2% యూరియా లేదా 1% పొటాషియం నైట్రేట్ (KNO_3) ద్రావణాన్ని ఆకులపై పిచికారీ చేయాలని కోరారు.అలాగే నేలపై ఏర్పడిన గట్టి పొరను తొలగించి తేమ నిల్వ ఉండేలా తేలికగా దున్నడం (అంతరకృషి) చేయాలని గట్లు చిన్న కాలువలు ఏర్పాటు చేసి వర్షపు నీటిని పొలంలోనే సంరక్షించుకోవాలని వివరించారు.ఈ కార్యక్రమంలో చల్లాపూర్ గ్రామ సర్పంచ్ రోజా రమేష్, ఈర్లపల్లి గ్రామ సర్పంచ్ పద్మ వెంకటరాములు, మండల వ్యవసాయ అధికారి (AO) తులసి, వ్యవసాయ విస్తరణ అధికారులు వినోద్,వైష్ణవి, జ్యోతి,నిఖిల్, లోకేష్,శ్రీదేవి, వాసన్ ఎన్జీఓ ప్రతినిధులు,గ్రామస్తులు విజయకుమార్,పకీరప్ప, శరణయ్య తదితర రైతులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

**చింతపల్లి మండలంలోని హాస్టళ్లు, జెడ్పీహెచ్ఎస్ పాఠశాలను పరిశీలించిన మండల స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య**



**చింతపల్లి, జూలై 18 జర్నలిస్ట్ డైరీ** చింతపల్లి మండల స్పెషల్ ఆఫీసర్ గోవిందయ్య శనివారం మండలంలోని మూడు ప్రభుత్వ హాస్టళ్లతో పాటు జెడ్పీహెచ్ఎస్ (ZPHS) చింతపల్లి పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, భోజనం నాణ్యత, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం తరగతి గదులను సందర్శించి విద్యార్థుల హాజరు, బోధన విధానం, పాఠశాల నిర్వహణపై ఆరా తీశారు.విద్యార్థులకు ప్రతిరోజూ నాణ్యమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీల్లో ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ అంజయ్య, జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# అరెస్టులతో భయపడం..

-రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది"

-బిఆర్ఎస్ నేత కార్తీక్ రెడ్డి హెచ్చరిక

-బహుద్దూర్‌గూడ రైతులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డి అరెస్ట్

-నందిగామ పోలీస్ స్టేషన్‌కు తరలింపు..

-సంఘీభావం తెలిపిన షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :** రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహుద్దూర్‌గూడలో ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు టెర్మినల్ కోసం భూముల సేకరణ అంశం ఉద్రిక్తతకు దారితీసింది. భూముల సేకరణ కోసం అధికారులు గ్రామానికి చేరుకోగా, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు, సరైన పరిహారం ప్రకటించిన తర్వాతే భూములు ఇస్తామని రైతులు, గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న బాధిత రైతులు, గ్రామస్తులకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన బీఆర్ఎస్ యువనేత పట్లోళ్ల కార్తీక్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. అనంతరం ఆయనను రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని నందిగామ పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న షాద్‌నగర్ బీఆర్ఎస్ నాయకులు రాజా వరప్రసాద్, రాంబల్ నాయక్, వంకాయల నారాయణ రెడ్డి, నక్కల వెంకటేష్ గౌడ్ నందిగామ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని కార్తీక్ రెడ్డికి సంఘీభావం తెలిపారు. రైతుల సమస్యలపై పోరాడుతున్న నాయకుడిని అరెస్టు చేయడం సరికాదని వారు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నందిగామ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడిన పట్లోళ్ల కార్తీక్ రెడ్డి, పోలీసులు అరెస్టు చేసినంత మాత్రాన తాను వెనక్కి తగ్గేది లేదన్నారు. రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. "అరెస్టులతో భయపడేది లేదు. రైతులకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదు. రైతుల హక్కుల కోసం చివరి వరకు పోరాడుతాం" అని కార్తీక్ రెడ్డి అన్నారు. బహుద్దూర్ గూడ రైతులకు న్యాయమైన పరిహారం, ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా బలవంతంగా భూములు సేకరించే ప్రయత్నాలు చేయడం తగదని బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. రైతుల హక్కులను కాపాడేందుకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# ఉద్యమకారులకు అండగా ఎల్లప్పుడూ ఉంటా..

-పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండండి

-అమరవీరుల స్థూపం ఆవిష్కరణను విజయవంతం చేయండి

-షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

-తెలంగాణ తల్లి, షోయబుల్లా ఖాన్ విగ్రహాలను సొంత నిధులతో ఏర్పాటు చేస్తా..

-షాద్ నగర్ టీయూజేఏసీ నేతలు టీజీ శ్రీనివాస్, పినపాక ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలుసుకున్న ఉద్యమ కారులు

-ఉద్యమ నేతలతో ఎమ్మెల్యే శంకర్ కీలక చర్చలు





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :** తెలంగాణ ఉద్యమకారులు పార్టీలకు అతీతంగా ఐక్యంగా ఉండాలని, ఉద్యమకారుల కోసం ఎలాంటి సహాయానికైనా తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తన సొంత నిధులతో నిర్మించిన తెలంగాణ అమరవీరుల స్థూపం ఆవిష్కరణను తెలంగాణ ఉద్యమకారులందరూ కలిసి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక (టీయూజేఏసీ) నాయకులు గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టిజి శ్రీనివాస్ నేతృత్వంలో ఆయా పార్టీలకు, సంఘాలకు, మీడియాకు చెందిన ఉద్యమకారులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అమరవీరుల స్థూపం నిర్మాణానికి అభినందనలు తెలిపారు. తెలంగాణ ఉద్యమాన్ని, ఉద్యమకారుల త్యాగాలను గౌరవిస్తూ తన సొంత నిధులతో అమరవీరుల స్థూపాన్ని నిర్మించడం ద్వారా ఉద్యమంపై తనకున్న నిబద్ధతను చాటుకున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా టీయూజేఏసీ నాయకులు మాట్లాడుతూ, ధ్వంసమైన తెలుగుతల్లి విగ్రహం స్థానంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, తెలంగాణ రైతాంగ పోరాటంలో కలాన్ని గన్నుగా మార్చి పోరాడిన మహనీయుడు షోయబుల్లా ఖాన్ విగ్రహాన్ని కూడా ప్రతిష్ఠించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ, తెలంగాణ ఉద్యమంలో కీలకంగా పనిచేసిన ప్రతి ఉద్యమకారుడిని గుర్తించి వారికి తగిన గౌరవం కల్పించేలా కృషి చేస్తానన్నారు. ఉద్యమకారులు ఏ సమస్యతో వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. అలాగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమం పూర్తయిన వెంటనే టీయూజేఏసీ నాయకులు కోరిన మేరకు తెలంగాణ తల్లి మరియు షోయబుల్లా ఖాన్ విగ్రహాలను కూడా తన సొంత నిధులతో ఏర్పాటు చేస్తానని ప్రకటించారు.

రేపు జరిగే అమరవీరుల స్థూపం ఆవిష్కరణ కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీయూజేఏసీ సలహాదారులు వంగూరి గంగిరెడ్డి, ఎండి ఖాజా ఫాషా (కేపీ), పంది వెంకట్రాంరెడ్డి, లట్టుపల్లి మోహన్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు పినపాక ప్రభాకర్, అధ్యక్షుడు టీజీ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి అనుముల శ్రీధర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు జాంగారి రవి, బుద్దల జంగయ్య, అదెట్ల రాజు, కోశాధికారి కొండోజు వంశీకృష్ణ, నాయకులు బిశ్వా కృష్ణయ్య, ఎన్. రతన్ నాయక్, మూల జనార్ధన్, కరుణాకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ లో గులాబీ గర్జన..

-యువ సంగ్రామ సదస్సుకు భారీ తరలిన గులాబీ శ్రేణులు

-మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో 500కు పైగా వాహనాలలో సరూర్ నగర్ కు తరలివెళ్లిన నియోజకవర్గ గులాబీ యువ నేతలు

-వాహన శ్రేణిని ప్రారంభించిన బీఆర్ఎస్ యువనేత వై. మురళీకృష్ణ యాదవ్

-నియోజకవర్గ నలుమూలల నుండి తరలివచ్చిన ప్రధాన నేతలు, కార్యకర్తలు

-యువ సంగ్రామ సదస్సుతో యువ నేతల్లో నూతన ఉత్సాహం

-కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలయ్యే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని నిలదీస్తామని హెచ్చరించిన నేతలు

-ఉద్యోగాలు ఇస్తామని మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చురకలు



**రంగారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 18 (జర్నలిస్ట్ డైరీ) :** షాద్ నగర్ పట్టణం జై తెలంగాణ నినాదాలతో మారు మ్రోగింది. ముక్తకంఠంతో గులాబీ శ్రేణులు గర్జించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరును ఎండగడుతూ వ్యతిరేక నినాదాలు చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం కు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్ సరూర్ నగర్ స్టేడియంలో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ పార్టీ యువ సంగ్రామ సదస్సుకు మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో 500 వాహనాలకు పైగా గులాబీ శ్రేణులు తరలిన నేపథ్యంలో పలువురు బిఆర్ఎస్ నేతలు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ మోసపూరిత మాటలతో ప్రజలను మభ్యపెడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ముఖ్యంగా యువతకు తీవ్ర అన్యాయం జరిగే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఉద్యోగాలు, ఉపాధి వనరులు చూపకుండా తెలంగాణ యువతను మోసం చేసిందని మండిపడ్డారు. హామీలు నెరవేర్చే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వ నిలదీస్తూనే ఉంటామని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పి మరో మారు కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెస్తామని చెప్పారు. ఇందులో భాగంగానే రెడ్ రోజ్ ఫంక్షన్ హాల్ వద్ద భారీ వాహన శ్రేణికి బీఆర్ఎస్ నాయకుడు వై. మురళీకృష్ణ యాదవ్ జెండాను ఊపి ప్రారంభించారు. ఇదిలా ఉంటే యువ సంగ్రామ సదస్సుకు నియోజకవర్గంలోని నలుమూలల నుండి గులాబీ శ్రేణులు ఊహించని రీతిలో తరలివచ్చారు. దీంతో యువనేతల్లో నూతన ఉత్సాహం నెలకొంది. జై తెలంగాణ, జై కేసీఆర్, జై అంజన్న అంటూ నినాదాలు చేస్తూ సరూర్ నగర్ కు తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో షాద్ నగర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ యువత పాల్గొన్నారు.

# విద్యార్థులు ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి: డాక్టర్ బి. విజయరంగ



విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బి. విజయరంగ

**జర్నలిస్ట్ డైరీ. కొత్తపేట్:** విద్యార్థులు ఆర్యోగం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని లయన్ క్లబ్ కొత్తపేట హైదరాబాద్ రీజియన్ చైర్మన్ లయన్ డాక్టర్ విజయరంగ అన్నారు. శనివారం ఐకేఎస్ కేర్స్ ఫౌండేషన్, లయన్స్క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట ఈస్ట్. జీవనది క్లబ్స్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా పరిధిలోని కొత్తపేట తో పాటు వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో మెగా డెంటల్. అనీమియా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ముఖ్యఅతిధిగా ఉస్మానియా హాస్పిటల్ ఆర్ఎంఓ డాక్టర్ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు. ఈ సంధ్బంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై దృష్టి సాదించ గలుగుతాయని తెలిపారు. అనారోగ్యంతో ఉన్నప్పుడు మొదడు త్వరగా అలసిపోతుందని, దీనివల్ల ఏకాగ్రత దెబ్బతిటుందని అన్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరుకాగలరని అన్నారు. విద్యార్థులు పండ్లు, కూరగాయాలు తగినంత నీరు తీసుకోవడం ద్వారా మెదడుకు కావాల్సిన శక్తి అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీకాంత్రెడ్డి, ప్రతాప్ రెడ్డి, లయన్ క్లబ్ సభ్యులు డాక్టర్ శ్రీలతరాణి, నిర్మల్ కుమార్జైన్, విశ్లేష్, డాక్టర్ సాయికుమార్, జయప్రకాష్, తదిరతులు పాల్గొన్నారు.

# యువ సంగ్రామ సదస్సుకు ఇబ్రహీంపట్నం నుంచి భారీ ర్యాలీ



**ఇబ్రహీంపట్నం (జులై 18) జర్నలిస్ట్ డైరీ.** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు యువత కు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలనీ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన యువ సంగ్రామ సదస్సుకుకు ఇబ్రహీంపట్నం నుండి భారీ సంఖ్యలో యువత, కార్యకర్తలు తరలి వెళ్లారు.

బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మంచి రెడ్డి కిషన్ రెడ్డి, రాష్ట్ర నాయకులు మంచి రెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు, బీఆర్ఎస్వీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అధ్యక్షులు నిట్టు జగదీశ్వర్, మున్సిపాలిటీ అధ్యక్షులు మడుపు శివ సాయి ఆధ్వర్యంలో సుమారు 1000 మంది యువత, విద్యార్థులు భారీ ఎత్తున సరూర్‌నగర్ యువ సంగ్రామ సదస్సుకు బయలుదేరారు.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి చెందిన పలువురు విద్యార్థి నాయకులు, యువజన నాయకులు, బీఆర్ఎస్వీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని, యువతను మోసం చేస్తోందని నాయకులు విమర్శించారు. యువత ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని వారు పేర్కొన్నారు.

# అత్యవసర అధికారిక కార్యక్రమాల వల్ల వికారాబాద్‌లో ప్రజావాణి రద్దు



**వికారాబాద్ (జర్నలిస్టు డైరీ) జూలై 18** వికారాబాద్ జిల్లాలో ఈ నెల 20వ తేదీ సోమవారం నాడు అత్యవసర అధికారిక కార్యక్రమాలు ఉన్నందున, ఆ రోజు కలెక్టరేట్‌లో నిర్వహించాల్సిన 'ప్రజా వాణి' కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టర్ ఇతర ముందస్తు ప్రభుత్వ అధికారిక విధుల్లో పాల్గొనవలసి ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. కావున సోమవారం నాడు జిల్లా ప్రజలు ఎవరూ కూడా తమ సమస్యలపై దరఖాస్తులు సమర్పించేందుకు జిల్లా కలెక్ట్రేట్ కార్యాలయానికి రావద్దని, ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్రజలందరూ సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# బిజినెస్

## మళ్లీ తగ్గుతున్న బంగారం, వెండి ధరలు.. తులం ఎంతంటే?

పసిడి ప్రియులకు బంగారం, వెండి ధరలు స్వల్ప ఊరటనిచ్చాయి. గత రెండు మూడు రోజులుగా వరుసగా పెరుగుతూ వస్తున్న ఈ ఆభరణాల ధరలు శుక్రవారం ఒక్కసారిగా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ పరిణామాలు, డాలర్, రూపాయి విలువ మారకంతో బంగారం, వెండి ధరలు మార్పుకు కారణమని మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఈ భారీ హెచ్చుతగ్గుల తర్వాత అంటే శనివారం ఉదయం 6గంటలకు దేశీయ మార్కెట్‌లో 24 క్యారట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,42,520గా వద్ద ట్రేడవుతుండగా.. 22 క్యారట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,30,640 వద్ద స్థిరపడింది. ఇక వెండి ధర విషయానికి వస్తే.. దేశీయ మార్కెట్‌లో కేజీ వెండి ధర రూ.2,29,900 వద్ద కొనసాగుతుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయంటే..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,42,520, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,30,640 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.



విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,42,520, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,30,640 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,42,670, 22 క్యారెట్ల ధర రూ.1,30,790 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,29,900 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,42,520, 22 క్యారెట్ల ధర రూ.1,30,640 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,29,900 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.143,900, 22 క్యారెట్ల ధర రూ.1,30,990 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,42,520, 22 క్యారెట్ల ధర రూ.1,30,640 ఉంది. వెండి కిలో ధర రూ.2,29,900 లుగా ఉంది.

## ఇండియా లో జోరు లేని 'టెస్లా' కార్ల అమ్మకాలు !!




ప్రపంచ ప్రఖ్యాత బిలియనీర్ ఎలాన్ మస్క్‌కు చెందిన ఎలక్ట్రిక్ వాహనాల దిగ్గజ సంస్థ 'టెస్లా' భారత మార్కెట్లోకి ప్రవేశించి ఈ జూలై 15 నాటికి సరిగ్గా ఏడాది పూర్తయింది. ఎన్నో అంచనాల మధ్య భారతీయ ఆటోమొబైల్ రంగంలోకి అడుగుపెట్టినప్పటికీ, తొలి ఏడాదిలో ఈ కంపెనీకి ఆశించిన స్థాయిలో అసలు అమ్మకాలే జరగలేదు. గడిచిన 12 నెలల కాలంలో టెస్లా ఇండియాలో కేవలం 450 వాహనాలను మాత్రమే విక్రయించగలిగిందని ఆటోమొబైల్ ఇండస్ట్రీ వర్గాలు వెల్లడించాయి. భారతీయ మార్కెట్ నాడిని పట్టుకోవడంలో టెస్లా తొలి అడుగులోనే తీవ్ర వెనుకబాటుకు గురికావడం ఇప్పుడు ఆటోమొబైల్ రంగాన్ని ఆశ్చర్యానికి గురిచేస్తోంది..

**విక్రయాలు తగ్గడానికి కారణాలు -- అధిక ధరలు మరియు భారీ ట్యాక్సులు**

టెస్లా అమ్మకాలు ఇంత దారుణంగా పడిపోవడానికి ప్రధాన కారణం ఆ కంపెనీ కేవలం 'మోడల్ వై' కార్లను మాత్రమే ప్రస్తుతం భారత్‌లో విక్రయిస్తుండటమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి తోడు విదేశాల నుండి దిగుమతి చేసుకునే వాహనాలపై భారత్ విధిస్తున్న అధిక ఇంపోర్ట్ డ్యూటీ (దిగుమతి సుంకాలు) వల్ల కారు ధర సామాన్యుడికి అందనంత ఎత్తుకు చేరింది. మొదట ఈ కారును రూ. 59.89 లక్షల (ఎక్స్-షోరూమ్) భారీ ధరతో లాంచ్ చేయగా, అమ్మకాలు పుంజుకోకపోవడంతో 2026 మే నెలలో ఈ ధరను రూ. 50.89 లక్షలకు తగ్గించారు. అయినప్పటికీ, భారతీయ ఇవి (జుం) మార్కెట్లో టాటా, మహీంద్రా, బివైడి వంటి కంపెనీల నుండి గట్టి పోటీ ఉండటంతో టెస్లా కారును కొనేందుకు వినియోగదారులు అంతగా ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది.

## టెక్ మహీంద్రాకు లాభాల జోష్

ఐటీ సేవల దిగ్గజం టెక్ మహీంద్రా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో రూ.1,465 కోట్ల నికర లాభం ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ1తో పోలిస్తే ఇది సుమారు 28 శాతం వృద్ధి. ఆదాయం 18 శాతం పెరిగి రూ. 15,712 కోట్లకు చేరింది. మొత్తం సిబ్బంది సంఖ్య 863 మేర తగ్గి 1,46,760కి పరిమితమైంది. ఐటీ అట్రిషన్ రేటు 11.8 శాతంగా ఉంది. కంపెనీ సీఈవో మోహిత్ జోషి ప్రకారం, వరుసగా మూడో త్రైమాసికంలో బిలియన్ డాలర్లకు పైగా డీల్స్ సాధించారు. 50 మిలియన్ డాలర్లకు పైగా కాంట్రాక్టులు ఇచ్చిన సంస్థల సంఖ్య ఏడు పెరిగింది.





## రోహిత్ శర్మ వన్డే భవిష్యత్తుపై ఊహాగానాలు.. చెక్ పెట్టిన బీసీసీఐ కార్యదర్శి

**లండన్**

క్రికెటర్ రోహిత్ శర్మ భవిష్యత్తుపై ఊహాగానాలు వినిపిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం లార్డ్స్‌లో ఇంగ్లండ్‌తో జరిగే మ్యాచ్ అతని అంతర్జాతీయ కెరీర్‌లో చివరి వన్డే అవుతుందని రూమర్స్ వచ్చిన నేపథ్యంలో బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పందించారు. లార్డ్స్ వన్డే రోహిత్ కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ కాదు అని ఆయన అన్నారు. రోహిత్ భవిష్యత్తుపై మీడియాలో కథనాలు వ్యాపిస్తున్నాయని, అయితే లార్డ్స్‌లో రోహిత్ చివరి వన్డే ఆడుతాడాన్న చర్చలు జరగలేదని సైకియా తెలిపారు. భారత వన్డే జట్టులో రోహిత్ శర్మ రెగ్యులర్ సభ్యుడు అని, దేశానికి అతను వీలైనంత కాలం ప్రాతినిధ్యం వహిస్తాడన్నారు. లార్డ్స్‌లో జరిగే వన్డే అతని కెరీర్‌లో చివరిది కాబోదన్నారు.

**గణాంకాలు బాగున్నా.. తగ్గిన రోహిత్ దూకుడు**


చాంపియన్స్ ట్రోఫీ విజయం తర్వాత రోహిత్ 14 వన్డే ఇన్నింగ్స్‌ల్లో 45.3 సగటు, 92.03 స్ట్రైక్ రేట్‌తో ఒక సెంచరీ, నాలుగు హాఫ్ సెంచరీల సాయంతో 589 పరుగులు చేశాడు. ఈ గణాంకాలు అతడి కెరీర్



సగటు (48.58 సగటు, 92.76 స్ట్రైక్ రేట్)కు దగ్గరగానే ఉన్నప్పటికీ, పరుగులు సాధిస్తున్న తీరు మాత్రం ఆందోళన కలిగిస్తోంది. 2023 వన్డే ప్రపంచకప్‌లో 54.27 సగటు, 125.94 భీకర స్ట్రైక్ రేట్‌తో ఆడి భారత్‌ను ఫైనల్‌కు చేర్చిన రోహిత్ మార్క్ దూకుడు ప్రస్తుత ఆటలో కనిపించడం లేదు. ప్రతి ఇన్నింగ్స్ అతడికి ఒక పరీక్షలా మారడంతో క్రీజులో స్వేచ్ఛగా ఆడలేకపోతున్నాడు. మరోవైపు, జట్టులో స్థానం కోసం యువ ఆటగాళ్ల నుంచి గట్టి పోటీ ఎదురవుతోంది. ఓపెనర్ స్థానం కోసం 24 ఏండ్ల ముంబై యువ సంచలనం యశస్వి జైస్వాల్ వన్డేల్లోనూ తన ముద్ర వేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. చివరి మూడు వన్డేల్లోనే జైస్వాల్ రెండు శతకాలు బాదాడు. దక్షిణాఫ్రికాపై సెంచరీ చేసిన రుతురాజ్ కూడా రేసులోకి రావడంతో రోహిత్‌పై ఒత్తిడి పెరిగింది.

## ఫుట్‌బాల్ ఆడుతూ పెరిగాం.. ఒత్తిడిని ఎలా అధిగమిస్తామంటే..!

వరసగా రెండోసారి అర్జెంటీనా ఫిఫా ప్రపంచకప్ ఫైనల్‌కు ఆడుతోంది. నాలుగేళ్ల క్రితం తన సారథ్యంలో ఫ్రాన్స్‌ను ఓడించి టైటిల్ ముద్దాడిన దక్షిణ అమెరికా జట్టును ఈసారి విజేతగా నిలపాలని లియోనల్ మెస్సీ భావిస్తున్నాడు. ఆదివారం న్యూ జెర్సీలో బిగ్ ఫైట్‌కు ముందు.. మెస్సీ మైదానంలో ఒత్తిడి గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. టెన్నిస్ స్టార్ నొవాక్ జకోవిచ్ అడిగిన పలు ప్రశ్నలకు ఓ మానసిక నిపుణుడిలా బదులిచ్చాడీ దిగ్గజం. జట్టుగా మీరంతా ఒత్తిడిని ఎలా జయిస్తారు? విమర్శలకు ఎలా చెక్ పెడతారు? అనే సవాళ్లకు నా ఆటతోనే అని మెస్సీ చెప్పడం అందర్నీ ఆకట్టుకుంది. ఫిఫా వరల్డ్‌కప్ అంతిమ సమరానికి ఒక్కరోజే ఉంది. వరసగా రెండోసారి ట్రోఫీపై కన్నేసిన అర్జెంటీనా ఫైనల్లో స్పెయిన్‌కు చెక్ పెట్టాలనే కసితో ఉంది. ఇరుజట్ల మధ్య హోరాహోరీ పోరు అభిమానులను ఉర్రూతలూగించడం ఖాయమవ్వగా.. ఈ హైఓల్టేజ్ ఫైట్‌కు ముందు ఒక ఈవెంట్‌లో లియోనల్ మెస్సీ అభిమానుల మనసులు దోచుకున్నాడు. మన్‌హట్టన్‌లో జరిగిన 'ది ఫంటాస్టిక్స్ ఫెస్ట్'లో అర్జెంటీనా ఆటగాళ్లు పాల్గొనగా.. టెన్నిస్ లెజెండ్ నొవాక్ జకోవిచ్ మెస్సీని ప్రశ్నించాడు. నాకౌట్(రౌండ్ 32, రౌండర్ 16,)లో



ప్రత్యర్థి ఆధిక్యంలో ఉన్నా సరే.. అద్భుతంగా పుంజుకొన్న తీరును ప్రశంసిస్తూ మీరు ఒత్తిడిని ఎలా జయిస్తారు? విమర్శలకు ఎలా ముగింపు పలుకుతారు? అని జకో అడుగాడు. అందుకు మెస్సీ తమకు ఒత్తిడి అనే మాటే తెలియదని చెప్పాడు. నేను ఇదివరకు చెప్పినట్టు మేమంతా ఫుట్‌బాల్ ఆడుతూ పెరిగాం. మాకు ఈ ఆటంటే ప్రాణం. జాతీయ జట్టుకు ఆడాలి, ఆటను ఆస్వాదించాలి అనే బలమైన కోరిక మాలో ఉండేది. స్కూల్లో, వీధుల్లో.. జట్టుతోనూ మేము ఎంతో ఇష్టంగా ఫుట్‌బాల్ ఆడేవాళ్లం. మా దేశంలోని క్లబ్ జట్లకు ఆడినప్పుడు కూడా మేము ఒత్తిడి గురించి ఆలోచించేవాళ్లం కాదు. మైదానంలో ఆటపై దృష్టి సారించడం, ప్రత్యర్థితో పోటీపడడం ఇవే మాకు తెలుసు. మేము పోటీదారులం. అదే మంత్రతో విజయాలు సాధిస్తున్నాం. రెండు జట్లు తలపడుతున్నప్పుడు ప్రతిసారి మనదే పైచేయి అవ్వదు. ఈ విషయాన్ని చిన్నతనంలోనే నేర్చుకున్నా. మరో విషయం.. మనం ప్రతిసారి గెలవం అనేది గ్రహించాను. ఆటలో దాగున్న ఈ నిజం తెలిశాక వ్యక్తిగా, ఆటగాడిగా నేను మెరుగయ్యాను' అని మెస్సీ చాలా సరళంగా, స్పష్టంగా చెప్పడంతో అభిమానులంతా 'వావ్'.. అని చప్పట్లు కొట్టారు.

**దిగ్గజాలతో సెల్ఫీ..**

అభిమానుల కోసం ఏర్పాటు చేసిన ఈవెంట్‌లో అర్జెంటీనా ఆగాళ్లు సందడి చేశారు. అమెరికా ఫుట్‌బాల్ దిగ్గజం టామ్ బ్రాడీ, ఎన్‌బీఏ ఐకాన్ కెవిన్ డురంట్.. పలువురితో మెస్సీ ముచ్చటించి సెల్ఫీలు దిగాడు. వరల్డ్‌కప్ అంటే గోల్స్‌తో చెలరేగే మెస్సీ.. ఈసారి 8 గోల్స్‌తో గోల్డెన్ బూట్ అవార్డు రేసులో ముందున్నాడు. ఆదివారం ఫైనల్లో స్పెయిన్‌పై మెస్సీ మరో గోల్ కొడితే అవార్డు అతడికే దక్కనుంది. ఫ్రాన్స్ కెప్టెన్ కిలియన్ ఎంబాపే సైతం 8 గోల్స్‌తో సంయుక్తంగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. దాంతో.. గోల్డెన్ బూట్ ఎవరికి దక్కనుంది? అనేది ఆసక్తి రేపుతోంది.

# స్పోర్ట్స్

## సింధుకు తొలి ఫైనల్.. రెండేళ్ల టైటిల్ కరువు తీరేనా..!




ఒలింపిక్ విజేత పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణ ఫలించింది. వరసగా నిరాశ పరుస్తున్న తెలుగుతేజం జపాన్ ఓపెన్ ఫైనల్లో అడుగుపెట్టింది. లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టిలు తేలిపోయిన చోట భారత పతకం ఆశలు మోస్తున్న సింధు సెమీఫైనల్లో అదిరే విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. సెమీస్‌లో చెన్ యూఫీ ని చిత్తు చేసి ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ఈ మధ్య కాలంలో పరాజయాలతో విసిగిపోయిన భారత షట్లర్ 2024 తర్వాత తొలి ఫైనల్ ఆడబోతోంది. ఒలింపిక్ విజేత పీవీ సింధు రెండేళ్ల నిరీక్షణ ఫలించింది. వరసగా నిరాశ పరుస్తున్న తెలుగుతేజం జపాన్ ఓపెన్ (ఖ్శ్ఖ్ఞఖఅ ౣఖ్ఞవఅ 2026) ఫైనల్లో అడుగుపెట్టింది. లక్ష్యసేన్, ఆయుశ్ శెట్టిలు తేలిపోయిన చోట భారత పతకం ఆశలు మోస్తున్న సింధు సెమీఫైనల్లో అదిరే విజయంతో టైటిల్ పోరుకు దూసుకెళ్లింది. సెమీస్‌లో చెన్ యూఫీని చిత్తు చేసి ఈ మెగా టోర్నీ మహిళల సింగిల్స్ ఫైనల్ చేరిన తొలి భారత షట్లర్‌గా చరిత్ర సృష్టించింది. అంతేకాదు ఈ మధ్య కాలంలో పరాజయాలతో విసిగిపోయిన భారత షట్లర్ 2024 తర్వాత తొలి ఫైనల్ ఆడబోతోంది.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

# థియేటర్లలో నిరాశ.. ఓటీటీలో ప్రభాస్ సునామీ,

## ది రాజా సాబ్'కు 17.5 మిలియన్ వ్యూస్



టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ నటించిన 'ది రాజా సాబ్' థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా, ఓటీటీలో మాత్రం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ప్రముఖ మీడియా కన్సల్టింగ్ సంస్థ ఓర్మాక్స్ స్ట్రీమ్‌వ్యూ విడుదల చేసిన 2026 తొలి ఆరు నెలల నివేదికలో ఈ చిత్రం భారతదేశంలో అత్యధిక వ్యూస్ సాధించిన సౌత్ ఇండియన్ సినిమాగా అగ్రస్థానంలో నిలిచింది. థియేట్రికల్ రిలీజ్ సమయంలో మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లో మాత్రం ప్రేక్షకులు ఈ చిత్రానికి భారీ ఆదరణ చూపించారు. జియోహాట్‌స్టార్‌లో స్ట్రీమింగ్‌కు వచ్చిన 'ది రాజా సాబ్' ఏకంగా 17.5 మిలియన్ వ్యూస్ సాధించి, ఈ ఏడాది తొలి అర్ధభాగంలో అత్యధికంగా వీక్షించిన సౌత్ సినిమా అనే ఘనతను సొంతం చేసుకుంది.ఓర్మాక్స్ విడుదల చేసిన టాప్-10 జాబితాలో మలయాళ చిత్రాలు నాలుగు స్థానాలు దక్కించుకుని తమ సత్తా చాటగా, తెలుగు నుంచి 'ది రాజా సాబ్', 'అగ్లీ స్టోరీ', 'అఖండ 2', 'అర్జున్ సన్ ఆఫ్ వైజయంతి' చిత్రాలు చోటు దక్కించుకున్నాయి. తమిళం నుంచి 'బ్లాస్ట్', 'యూత్' సినిమాలు కూడా ఈ జాబితాలో నిలిచాయి. అయితే అన్ని చిత్రాలను వెనక్కి నెట్టి ప్రభాస్ సినిమా అగ్రస్థానంలో నిలవడం విశేషం.దర్శకుడు మారుతి తెరకెక్కించిన ఈ హారర్-కామెడీ చిత్రంలో ప్రభాస్ సరసన మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటించారు. థియేటర్లలో ఆశించిన ఫలితం రాకపోయినా, ఓటీటీలో లభించిన ఈ భారీ ఆదరణ ప్రభాస్‌కు డిజిటల్ ప్రేక్షకుల్లో ఉన్న క్రేజ్‌ను మరోసారి చాటిచెప్పింది. థియేటర్లలో మిశ్రమ ఫలితం అందుకున్న సినిమా.. ఓటీటీలో మాత్రం రికార్డు స్థాయి వ్యూస్ సాధించి నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకోవడం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇక ప్రభాస్ ప్రస్తుతం ఫౌజీ చిత్రంతో బిజీగా ఉన్నాడు. ఈ సినిమా హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతుంది. ఈ సినిమా తర్వాత సలార్ 2, కల్కి 2, స్పిరిట్ వంటి చిత్రాలు చేయనున్నాడు.



హాట్ ఫొటోలతో మత్తెక్కిస్తున్న రకుల్ ప్రీత్ సింగ్?..

# ఇంగ్లిష్ రాదని ఆటపట్టించేవారు!



తన పాఠశాల రోజుల గురించి కథానాయిక భాగ్యశ్రీ బోర్సే ఆసక్తికరమైన విషయాల్ని పంచుకుంది. ఇంగ్లిష్ రాకపోవడంతో అందరూ తనను ఆటపట్టించేవారని, నాటి అవమానాలను సవాలుగా తీసుకొని చదువుల్లో రాణించానని చెప్పుకొచ్చింది. ఇటీవల ఓ కాలేజీ విద్యార్థులతో జరిపిన ముఖాముఖిలో ఆమె ఈ సంగతుల్ని వెల్లడించింది. 'మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో నా బాల్యం గడిచింది. అక్కడే మరాఠీ మీడియం స్కూల్‌లో చదువుకున్నా. కొన్నాళ్ల తర్వాత నాన్న ఉద్యోగరీత్యా మా కుటుంబమంతా నైజీరియాకు షిఫ్ట్ అయ్యాం. అక్కడ ఇంగ్లిష్ మీడియం కావడంతో ఇబ్బందులు మొదలయ్యాయి.నాకేమో మరాఠీ, హిందీ తప్ప మరో భాష తెలియదు. ఇంగ్లిష్ రాదని స్కూల్లో అందరూ హేళన చేసేవారు. జోక్స్ వేస్తూ ఆటపట్టించేవారు. అయినా నేను ఏ మాత్రం కుంగిపోలేదు. అవహేళనలను ఛాలెంజ్‌గా స్వీకరించా. కొద్దిరోజుల్లోనే ఇంగ్లిష్‌పై పట్టుసాధించాను. ఆ తర్వాత కొన్నాళ్లకు ఇంగ్లిష్‌లో అనర్గళంగా ప్రసంగించే స్థాయికి చేరుకున్నా. పాజిటివ్ మైండ్‌సెట్‌తో ఉంటే ఎలాంటి సవాళ్లనైనా అధిగమించవొచ్చని నా స్కూల్ డేస్‌లోనే అర్థమైంది' అని చెప్పింది భాగ్యశ్రీ బోర్సే. ఇటీవలే ఈ భామ 'లెనిన్' సినిమాతో కెరీర్‌లో తొలి విజయాన్ని అందుకుంది.



# పెద్ది తర్వాత కొత్త సినిమాకు జాన్వీకపూర్ గ్రీన్ సిగ్నల్.. !

దేవర సినిమాతో టాలీవుడ్‌కు గ్రాండ్ ఎంట్రీ ఇచ్చింది బాలీవుడ్ భామ జాన్వీకపూర్. ఈ చిత్రం జాన్వీకపూర్ కు ఆశించిన స్థాయిలో బ్రేక్ ఇవ్వలేకపోయింది. రీసెంట్‌గా రాంచరణ్‌తో కలిసి నటించిన పెద్ది బ్లాక్ బస్టర్ హిట్‌గా నిలిచింది. అయితే ఈ మూవీ కూడా జాన్వీకపూర్‌కు అంతగా కలిసి రాలేదు. పెద్దిలో జాన్వీకపూర్‌కు సంబంధించిన కొన్ని సన్నివేశాలపై తీవ్రస్థాయిలో అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. భవిష్యత్‌లో ఇలాంటి పాత్రలు చేయొద్దంటూ పలువురు నెటిజన్లు జాన్వీకపూర్‌కు సూచించారు. అయితే జాన్వీకపూర్ నెక్స్ట్ ఎలాంటి ప్రాజెక్టు చేయబోతుందా..? అని ఆసక్తిగా చర్చించుకుంటున్నఅభిమానులు, మూవీ లవర్స్ కోసం క్రేజీ న్యూస్ నెట్టింట వైరల్ అవుతోంది. ఘ్రుస్త్రశ్రీఘట్ ఫేం ఉమేశ్ బిస్ట్ డైరెక్టర్‌తో కొత్త సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది జాన్వీకపూర్. బాలాజీ మోషన్ పిక్చర్స్, సిఖ్య ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్లపై ఏక్తాకపూర్, గునీత్ మోంగా ఈ సినిమాను తెరకెక్కించనున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ మూవీ వచ్చే అక్టోబర్-నవంబర్‌లో సెట్స్‌పైకి వెళ్లనుంది. ఉమేశ్ బిస్ట్ The Trial, Gyaarah Gyaarah వెబ్ షోలను డైరెక్ట్ చేశాడు. మరి ఉమేశ్ బిస్ట్ జాన్వీకపూర్ కోసం ఎలాంటి పాత్రను డిజైన్ చేశాడు. ఈ సినిమాతో అయినా జాన్వీకపూర్‌కు బ్రేక్ వస్తుందా..? అనేది తెలియాల్సి ఉంది.

## సుకుమార్ 'ఆర్‌సీ 17' లాంచింగ్ టైం ఫిక్స్..!



ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్నాడు టాలీవుడ్ స్టార్ యాక్టర్ రాంచరణ్ . ఈ గ్లోబల్ స్టార్ సుకుమార్ తో చేసిన రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17 సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది.తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు. మరి దీనిపై రాంచరణ్-సుకుమార్ టీం నుంచి ఏదైనా అధికారిక ప్రకటన వస్తుందేమో చూడాలి.

# రాకా కోసం దీపిక సాహసం?



ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం.

ప్రెగ్నెన్సీలో కూడా సెట్స్‌కి వచ్చి నటించిన నటీమణులు భారతీయ చలనచిత్ర చరిత్రలో చాలామందే ఉన్నారు. కానీ ప్రెగ్నెన్సీతో ఉండి యాక్షన్ సన్నివేశాల్లో నటించిన హీరోయిన్లు మాత్రం దాదాపుగా లేరనే చెప్పాలి. కానీ దీపిక పదుకోన్ ఆ ఫీట్ చేసి హిస్టరీ క్రియేట్ చేశారు. అల్లు అర్జున్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'రాకా'లో ఆమె కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఇటీవలే దీపికా పదుకోన్‌పై కీలకమైన యాక్షన్ సన్నివేశాలను దర్శకుడు అట్లీ చిత్రీకరించారట. రెండో బిడ్డకు జన్మనివ్వబోతున్న దీపిక.. ప్రెగ్నెనీతోనే కఠినమైన యాక్షన్ సన్నివేశాల్లో పాల్గొన్నారని సమాచారం.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465